ప్రజాశక్తి

సోమవారం 16 సెప్టెంబర్ 2024 8 పేజీలు


ప్రకాశం


బాపట్ల

వెళ్లి రావయ్యా..బొజ్జ గణపయ్య..


కొత్తపట్నం తీరంలో ..

గణేష్ నిమజ్జనోత్సవం సందర్భంగా ఆదివారం కొత్తపట్నం తీరంలో సందడి నెలకొంది. వందల సంఖ్యలో వినాయక విగ్రహాలను భక్తులు సముద్రంలో నిమజ్జనం చేశారు. తీరంలో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

- ప్రజాశక్తి, ఒంగోలు


ఒంగోలు పోలీస్‌క్వార్టర్స్‌లోని పోలీస్ గణనాథుని విగ్రహం నిమజ్జన ఊరేగింపులో పాల్గొన్న ఎస్‌పి దామోదర్, ఏఎస్పీ నాగేశ్వరరావు..


వినాయక విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న భక్తులు

వణికిస్తున్న జ్వరాలు

- ఫీవర్‌తో పాటు జలుబు, గొంతు సమస్యలు తీవ్రం
- కిటకిటలాడుతున్న ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు
- మొక్కుబడిగా ఇంటింటి సర్వేలు


ఒంగోలు, మాతాశిశు వైద్యశాలలో జ్వరాల బారినపడి చికిత్స పొందుతున్న చిన్నారులు

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

జ్వరం, జలుబు, గొంతు నొప్పి.. .. ప్రస్తుతం ప్రతి పది మందిలో నలుగురికి ఈ సమస్యలు కనిపిస్తున్నాయి. పెద్దలతో పాటు పిల్లలు కూడా జ్వరాల బారిన పడుతున్నారు. వాతావరణంలో మార్పులు, వర్షాల తర్వాత తాగునీటి జలాలు కలుషితం కావడంతో వ్యాధులు విజృంభిస్తున్నాయి. సీజనల్ వ్యాధులు ఏటా వచ్చేవే అయినప్పటికీ ఈ ఏడాది జలుబు చేస్తే చాలా రోజులు తగ్గడం లేదంటున్నారు. గొంతులో వైరస్ వల్లనే ఈ సమస్య ఎక్కువగా ఉందని వైద్యులు చెబుతున్నారు. ప్రైవేటు ఆసుపత్రులతో పాటు ప్రభుత్వ ఆసుపత్రులూ కిటకిటలాడుతున్నాయి.

జ్వరాల విజృంభణ కారణంగా ఆర్‌ఎంపీల వద్ద జనం పెద్దఎత్తున ఉంటున్నారు. గ్రామాల్లో ఇంటికొకరు ఏదోరకమైన ఆరోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. డెంగీ జ్వరాలు తీవ్రంగా ఉన్నాయి. గత నెలలోనే వైద్యశాఖ నిర్వహించిన సర్వేలో 41 డెంగీ కేసులు నమోదైనట్లు వైద్యశాఖ గణాంకాలు చెబుతున్నాయి. వాస్తవానికి ఈ సర్వే మొక్కుబడిగానే సాగింది. వాస్తవంగా రోగుల సమాచారం స్పష్టంగా కనిపించడం లేదు. ఒంగోలులో ఒక్కో ప్రైవేటు ఆసుపత్రిలోనే 20 నుంచి 50 వరకు జ్వర పీడితుల్లో ప్లేట్‌లెట్స్ తగ్గుతున్న పరిస్థితి ఉంది. ఇవన్నీ వైద్యశాఖ లెక్కల్లో ఉండటం లేదు. జనవరి నుంచీ డెంగీ కేసులు నమోదవుతూనే ఉన్నాయి. ముందస్తు చర్యలే కనిపించడం లేదు. వైద్యశాఖ వద్ద పూర్తి సమాచారం లేదు. వైరల్ జ్వరాలే ఎక్కువగా ఉంటున్నాయి. సీరియస్ కేసులను ఎక్కువగా ప్రైవేటు ఆసుపత్రులకే తరలిస్తున్నారు. దీంతో జిల్లా కేంద్రంతో పాటు ఇతర పట్టణాల్లో పేరున్న ప్రైవేటు ఆసుపత్రులన్నీ కిటకిటలాడుతున్నాయి. ఆసుపత్రులకు పరీక్షలు, మందులు, ఫీజులకు తడిచిమోపెడవుతోంది. డెంగీ వస్తే కేసు తీవ్రతను బట్టి రూ.50వేల నుంచీ లక్షకు పైగానే ఖర్చవుతోంది. కార్పోరేట్ ఆసుపత్రులకు సామాన్యులు వెళ్లే పరిస్థితి లేదు. ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లలేని పేదలు ప్రభుత్వ వైద్యశాలలను ఆశ్రయిస్తున్నారు. ప్రభుత్వ వైద్యశాలలను అన్ని రకాలుగా సీజనల్‌వ్యాధులకు వైద్యం అందించే స్థాయికి పెంచాల్సి ఉంది. ఇక వ్యాధులు తీవ్రంగా ఉండటానికి ఇటీవల వాతావరణంలో మార్పులే కారణం. తాగునీటి జలాలు కలుషితం కావడంతో పాటు వాతావరణంలోనూ వైరస్ ▶ 2లో

రాజకీయ వలలో.. సొంతింటి కల



- ఇళ్లు, ఇళ్లస్థలాల విషయంలో వైసిపి, టిడిపి పితలాటకం
- నాడు టిడ్కో ఇళ్ల విషయంలో రివర్స్ టెండర్ల పేరుతో వైసిపి ప్రభుత్వ నిర్లక్ష్యం
- నేడు ఇళ్ల పట్టాల విషయంలో నిజనిర్ధారణ కమిటీ పేరుతో టిడిపి నాన్చుడు ధోరణి
- సొంత గూటి కోసం పదేళ్లుగా పేదల ఎదురుచూపులు

ఒంగోలు, అగ్రహారం వద్ద వైసిపి ప్రభుత్వ హయాంలో పేదలకు ఇచ్చిన ఇళ్లస్థలాలు

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

ఒంగోలులో పేదల సొంతింటి కల నెరవేరేలా లేదు. పేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇచ్చే విషయాన్ని వైసిపి, టిడిపి నేతలు 'రాజకీయం' చేస్తున్నారు. పర్యవసానంగా ఇళ్లస్థలాల కోసం ఎదురుచూసే పేదలకు నిరాశ ఎదురవుతోంది. ఇళ్లు, ఇళ్ల స్థలాల కోసం పదేళ్లుగా ఎదురు చూస్తున్న పేదలకు ఇంకా ఎదురుచూపులు తప్పేలా లేవు. ఎన్నో అవాంతరాలను దాటుకొని పట్టా చేతిలో పెట్టుకున్న పేదలకు ఇప్పుడు మరో పరీక్ష ఎదురుకానుంది.

నాడు టిడ్కో ఇళ్ల విషయంలో..

2014లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ఒంగోలు నగరంలో ఇళ్లు లేని వారికి ఇళ్లు కట్టిస్తామని ప్రకటించింది. 2017లో జీప్లస్3 పద్ధతిలో ఇళ్లు కట్టించేందుకు ప్రజల నుంచి వాటా ధనం వసూలు చేసింది. 15,958 మంది ప్రజలు రూ.27.48 కోట్లు వాటా ధనంగా చెల్లించారు. మొదటి విడతలో చింతల వద్ద 1500 మందికి, రెండో విడతలో కొప్పోలు వద్ద 6 వేల మందికి జిప్లస్3 పద్ధతిలో ఇళ్లు కట్టించేందుకు శ్రీకారం చుట్టారు. నిర్మాణాలు ప్రారంభించారు. మిగిలిన లబ్ధిదారులకు స్థల సేకరణ చేసి ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించే క్రమంలో 2019లో ఎన్నికల కోడ్ రావడంతో ఆ ప్రక్రియ ఆగిపోయింది. ▶ 2లో

పేద కుటుంబానికి పెద్ద కష్టం

- తలసేమియా వ్యాధితో బాధపడుతున్న బాలిక
- ఇప్పటికే రూ.పది లక్షలు ఖర్చు చేసిన తల్లిదండ్రులు
- రూ.30 లక్షలు కావాలంటున్న వైద్యులు
- దిక్కుతోచని స్థితిలో పేద దళిత కుటుంబం

తలసేమియా వ్యాధి పేద దళిత కుటుంబానికి శాపంగా మారింది. రెక్కాడితే కానీ డొక్కాడని ఆ కుటుంబం వారిది. కుమార్తెకు తలసేమియా వ్యాధి సోకడంతో ఇప్పటికే ఇల్లు తాకట్టు పెట్టి, అందిన కాడికి అప్పులు చేసి రూ.10 లక్షలు ఖర్చు పెట్టారు. అయినా వ్యాధి నయం కాలేదు. ఆపరేషన్‌కు రూ.30 లక్షలు కావాలని వైద్యులు చెపుతుండటంతో అంత డబ్బు ఖర్చు పెట్టలేక, అల్లారు ముద్దుగా పెంచుకున్న కుమార్తెను చంపుకోలేక పడరాని పాట్లు పడుతున్నారు. ఆపన్న హస్తం కోసం ఎదురుచూస్తున్నారు.

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

పుల్లలచెరువు మండలంలోని యండ్రపల్లి గ్రామానికి చెందిన చిరదల రమాదేవి, యోగయ్యలకు మొదటి సంతానం రమ్య. ఏడో తరగతి వరకు అందరి పిల్లలతో పాటు ఆడుతూ పాడుతూ యండ్రపల్లిలోనే చదువుకుంది. కరోనా సమయంలో ఆరోగ్యం బాగాలేకపోతే రమ్యను గుంటూరు జనరల్ ఆసుపత్రికి తీసు కెళ్లారు. అక్కడ వైద్యులు పరీక్షలు నిర్వహించి తలసేమియా వ్యాధి వచ్చినట్లు నిర్ధారించారు. ఇదంతా జరిగి ఆరేళ్లయింది.



రమ్య మెడికల్ రిపోర్టులు చూపుతున్న బంధువులు

అప్పటి నుంచి రమ్యను పెద్దాసుపత్రులన్నీ తిప్పారు. అందు కోసం యండ్ర పల్లిలో ఉన్న ఇంటిని తాకట్టు పెట్టి రూ. ఐదు లక్షలు తీసు కున్నారు. అవి సరిపోక మరో రూ. ఐదు లక్షలు అప్పు చేసి ఆసుపత్రులన్నీ తిప్పారు. ఐదేళ్ల వరకు పదిహేను రోజులకు ఒకటి చొప్పున ఎ-పాజిటివ్ రక్తం ఎక్కించేవారు. ఎక్కించి నప్పుడు కొంచెం హుషారుగా ఉంటుంది. పది రోజులు దాటిన తర్వాత తిరిగి నీరసంతో మంచం పట్టేది. దీంతో తిరిగి రక్తం ఎక్కించాల్సి వచ్చేది. ఇలా ఒక్కో బాటిల్ రూ.1600 చొప్పున వినుకొండలో కొనుగోలు చేసి యర్ర గొండపాలెంలోని ప్రభుత్వ వైద్యశాలలో రక్తం ఎక్కిస్తున్నారు.

రోజురోజుకూ క్షీణిస్తున్న ఆరోగ్యం..

రెండు నెలలు నుంచి రమ్యకు మరీ ఎక్కువగా రక్తం తగ్గిపోతుండడంతో వారానికి నాలుగు ప్యాకెట్లు ఎక్కించాల్సి వచ్చిందని రమ్య తల్లిదండ్రులు చిరదల రమాదేవి, యోగయ్యలు వాపోయారు. 40 రోజుల్లోనే 18 ప్యాకెట్లు ఎక్కించినట్లు వివరించారు. అయినా రమ్యం నీరసంగానే ఉందని కంటనీరు పెట్టారు. యర్రగొండపాలెం ప్రభుత్వ వైద్యశాలలో కూడా తాము అన్ని సార్లు రక్తం ఎక్కించలేమని ఒంగోలు లాంటి పెద్దాసుపత్రికి పొమ్మని వైద్యులు చెబుతున్నారని కన్నీరు పెట్టుకుంటున్నారు. రోజురోజుకు తమ కుమార్తె ఆరోగ్యం క్షీణిస్తుందని పేర్కొన్నారు. రూ.30 లక్షలు ఖర్చు పెడితే తమ కుమార్తె ఆరోగ్యం కుదుట పడుతుందని పెద్దాసుపత్రి వైద్యులు తెలిపారని చెబుతు న్నారు. అయితే అంత ఆర్థిక స్తోమత తమ దగ్గర లేదని వాపోతున్నారు. ఇప్పటికే అప్పులు పెరిగి పోయాయని తెలిపారు. పింఛన్ కోసం దరఖాస్తు చేసుకుందామని గుంటూరులో ప్రభుత్వ ఆసుపత్రిలో మెడికల్ సర్టిఫికెట్ అడిగితే రూ.10 వేలు లంచం అడిగారని ఆ సమయంలో తమ దగ్గర లేక ఇవ్వలేకపోయామన్నారు. దీంతో పింఛన్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు వారు సర్టిఫికెట్ ఇవ్వలేదని చెప్పారు. ఫలితంగా మా పాపకు పింఛన్ కూడా రావడం లేదని వాపోయారు. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి తమ కుమార్తె ప్రాణాలు కాపా డేందుకు వైద్య చికిత్సలు చేయించాలని ప్రార్థిస్తున్నారు. దాతలు కనికరించి ఫోన్ పే నెంబర్ 9398996385కు ఆర్థిక సాయం చేయాలని కోరుతున్నారు.

వణికిస్తున్న జ్వరాలు

(మొదటిపేజీ తరువాయి)

ప్రభావం ఎక్కువగా ఉంది. తాగునీటిని సక్రమంగా ఫిల్టర్‌చేసి నీటిని అందించాల్సి ఉంది. అయితే చాలా తాగునీటి పథకాలు సక్రమంగా పనిచేయడం లేదు. నేరుగా సాగర్ జలాలను ట్యాంకుల్లో నింపి కుళాయిలకు ఇస్తున్నారు. వీటి వల్ల కూడా వ్యాధులు వస్తున్నాయి. ఎంత మేరకు రక్షిత నీరనన్నదే ప్రశ్నార్థకంగా మారింది. ఏదేమైనా జనాన్ని వ్యాధులు తీవ్రంగా చుట్టుముట్టాయి. జిల్లా మంత్రి డోలా వీరాంజనేయస్వామి వైద్యశాఖపై దృష్టి సారించాల్సి ఉంది. వ్యాధులపై సమీక్ష చేయాల్సిన అవసరం కనిపిస్తోంది.

రాజకీయ వలలో సొంతింటి కల

(మొదటిపేజీ తరువాయి)

తరువాత 2019లో అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం టిడ్కో ఇళ్లలో అవినీతి జరిగిందంటూ రివర్స్ టెండర్లకు వెళ్లింది. కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లింపు నిలిపివేసింది. దీంతో టిడ్కో ఇళ్ల నిర్మాణ పనులు నత్తనడకన సాగాయి. కొప్పోలు, చింతల వద్ద లబ్దిదారులను 4128 మందికి కుదించారు. 2024వ సంవత్సరం వరకు వారిలో ఏ ఒక్కరికీ ఇంటిని అప్పగించలేదు. ఇంకా టిడ్కో ఇళ్ల నిర్మాణ పనులు సాగుతూనే ఉన్నాయి.

ఇళ్ల పట్టాల వ్యవహారమిదీ..

2019లో అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం టిడ్కో ఇళ్లను పక్కన పెట్టింది. టిడ్కోలో ఇళ్ల కోసం డబ్బులు కట్టిన 15,958 మందిలో 4128 మందికి ఇళ్లు మంజూర య్యాయి. వారిని మినహా యించి మిగిలిన వారిని నవరత్నాలు–పేదలందరికీ ఇళ్ల పథకం లో చేర్చారు. అయితే 2023 సంవత్సరం వరకు ఈ పథకాన్ని ఒంగోలులో అమలు చేయలేదు. 2023 సంవత్సరంలో ఇళ్లస్థలాల కోసం సచివాలయాల వారీగా దరఖాస్తులు స్వీకరించగా టిడ్కోలో దరఖాస్తు చేసుకున్న వారు కాకుండా సుమారు మరో పదివేల మంది ఇళ్లస్థలాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. టిడ్కోలో డబ్బులు చెల్లించి ఇళ్లు రాని వారు 11,830 మంది ఉంటే కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారు సుమారు 10 వేల మంది ఉన్నారు. అంతా కలిపి సుమారు 22 వేల మంది అయ్యారు. వీరందరినీ సచివాలయాల వారీగా విచారించి, వారి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. వీరికి పట్టాలు ఇచ్చేందుకు స్థలం సమస్య ఎదురుకావడంతో, భూ సేకరణ పద్ధతిలో భూమిని సేకరించి, పట్టాలు ఇవ్వాలని నిర్ణయం చారు. 2023 సంవత్సరం చివరిలో భూసేకరణ కోసం ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. ఎన్ అగ్రహారం, మల్లేశ్వరపురం, వెంగముక్కపాలెం, యరజర్ల గ్రామాలలో 342 మంది రైతుల నుంచి 536 ఎకరాల భూమిని సేకరించారు. ఇందుకు గాను భూ సేకరణ కోసం రూ.210 కోట్లు రైతులకు చెల్లించారు. ఆయా ప్రాంతాల్లో లే అవుట్ల అభివృద్ధికి మరో రూ.21.33 కోట్లు ఖర్చు చేశారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో అప్పటి సిఎం జగన్ చేతులమీదుగా సుమారు 20 వేల మం దికి పట్టాలు ఇచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ముఖ్యమంత్రి లాంఛనంగా కార్యక్రమాన్ని ప్రారంభించడంతో అప్పటి ఎమ్మెల్యే బాలినేని సచివాలయాల వారీగా లబ్దిదారులకు పట్టాలను అందజేశారు. రిజిస్ట్రేషన్ చేసిన పట్టాలు అయితే చేతికిచ్చారు కానీ ఏ ఒక్కరికి స్థలం మాత్రం చూపించలేదు. ఇంతలో మార్చిలో ఎన్నికల కోడ్ రావడంతో వ్యవహారం అటకెక్కింది.

నేడు కూటమి ప్రభుత్వంలో ఇలా...

ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికల్లో గెలిచి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఒంగోలులో దామచర్ల జనార్దన్ టిడిపి ఎమ్మెల్యేగా గెలుపొందారు. గత ప్రభుత్వంలో పట్టాలు పొందిన వారికి స్థలాన్ని చూపించాల్సిన బాధ్యత ఇప్పటి పాలకుల మీద ఉంది. అయితే నాలుగు రోజుల కిందట ఎమ్మెల్యే జనార్దన్ చేసిన ప్రకటన పట్టాలు పొందిన లబ్దిదారుల్లో అలజడి సృష్టిస్తోంది. గత ప్రభుత్వం పంపిణీ చేసిన 20 వేల పట్టాలలో ఎక్కువమంది అనర్హులున్నారని, అన్ని పట్టాలను విచారించి అనర్హులను తెలుస్తామని ఎమ్మెల్యే ప్రకటించారు. అనర్హులకు ఇచ్చిన పట్టాలు రద్దు చేస్తామని చెప్పారు. అనర్హులను తేల్చేందుకు నిజనిర్ధారణ కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ముగ్గురు సీనియర్ కార్పొరేటర్లు, మరికొంతమంది అధికారులతో ఈ కమిటీ ఉంటుందని ప్రకటించారు. వీరు పట్టాల మీద విచారణ చేసి, ఎవరు అర్హులు...? ఎవరు అనర్హులు..? అనే జాబితాను తయారు చేసి వచ్చే మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నాటికి అందజేస్తారని చెప్పుకొచ్చారు. పట్టా పొందిన ప్రతి ఇంటికి వెళ్లి నిజనిర్ధారణ కమిటీ విచారణ చేస్తుందని వివరించారు. గత ప్రభుత్వం ఇళ్ల పట్టాకు సెంటు భూమిని మాత్రమే ఇచ్చిందని, తాము అర్హులను తేల్చి రెండు సెంట్లు ఇస్తామని చెప్పారు. ఎమ్మెల్యే ప్రకటన పట్టాలు పొందిన లబ్దిదారుల్లో అలజడి సృష్టిస్తోంది. కొంతమంది లో నిరాశకు కారణమవుతోంది. దాదాపు 20వేల మంది పట్టాదారులను విచారిం చేదెప్పుడు..? అర్హుల జాబితా తయారు చేసి పట్టా పొందిన వారికి స్థలం చూపించేదెప్పుడు.? అని లబ్దిదారులు చర్చించుకుంటున్నారు. ఎన్నో అవాంతరాలను అధిగమించి పట్టా చేతికి తెచ్చుకున్న పేదలకు ఇప్పుడు నిజనిర్ధారణ కమిటీ విచారణ పేరుతో పరీక్ష పెట్టడం పట్ల పలు విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

వారలా...వీరలా...?

మరికొంతమంది లబ్దిదారులు అటు వైసిపి, ఇటు టిడిపి నేతల తీరును పోల్చి చూస్తున్నారు. నాడు తెలుగుదేశం పార్టీ వాళ్లు టిడ్కో ఇళ్లు ఇచ్చారని వైసిపి వాళ్లు టిడ్కో ఇళ్లు పూర్తి చేసి.. లబ్దిదారులకు ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే, నేడు వైసిపి వాళ్లు పట్టాలు ఇచ్చారని స్థలాలు చూపకుండా టిడిపి వాళ్లు నాన్చుడు ధోరణి ప్రదర్శిస్తున్నారని లబ్దిదారులు చర్చించుకుంటున్నారు. మొత్తానికి ఈ ఇళ్ల స్థలాల వ్యవహారం ఒంగోలులో ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.

ఇంజినీర్లకు 'మోక్షగుండం' స్ఫూర్తిదాయకం

ప్రజాశక్తి-మార్కాపురం

మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఇంజినీర్లందరికీ స్ఫూర్తిదాయకం కావాలని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ అన్నా కృష్ణ చైతన్య తెలిపారు. మార్కాపురం సమీపంలోని దేవరాజుగట్టు వద్దగల కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రముఖ ఇంజినీరు మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి ఆదివారం నిర్వహించారు. విశ్వేశ్వరయ్య చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కృష్ణ చైతన్య మాట్లాడుతూ ఇంజినీర్ లేనిదే అభివద్ధే లేదన్నారు. విశ్వేశ్వరయ్య తన మేధోశక్తితో మానవ మనుగడకు అనేక ఫలాలను అందించారన్నారు. నదులకు ఆనకట్టలు నిర్మించి దేశ ఆర్థికాభివద్ధికి, భారతావని ప్రగతికి బలమైన పునాదులు నిర్మించిన ఘనత మోక్షగుండం విశ్వేశ్వరయ్యకే దక్కుతుందన్నారు. తన ఆలోచనలకు దార్శినికతను జోడించి బీడు భూములను సైతం సస్యశ్యామలం చేశారని కొనియాడారు. ఇంజినీరుగా, దార్శనికుడిగా, విద్యా ప్రదాతగా, నిపుణుడిగా, పారిశ్రామిక ప్రగతి చోదకుడిగా మోక్షగుండం విశ్వేశ్వరయ్య ప్రత్యేకతను చాటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వెన్నా కష్ణారెడ్డి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఏ.రంగనాయకులు, కళాశాల ఏవో బి ప్రభాకర్, ఎన్ఎస్-ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ పివి. అనిల్‌కుమార్, వివిధ విభాగాల అధిపతులు రామ్మోహన్, డాక్టర్ అనిల్‌కుమార్, కె.రాముడు, కె.కిషోర్ బాబు, ప్రసన్న మురళి, జె.రమణారెడ్డి, ఏ. అమతవల్లి, మనోహర్, ఫిజికల్ డైరెక్టర్లు రంగస్వామి, అంజనీకుమార్ సిబ్బంది పాల్గొన్నారు.



కిట్స్ ఇంజనీరింగ్ కాలేజిలో



జార్జి ఇంజింగ్ కాలేజిలో

జార్జి ఇంజినీరింగ్ కళాశాలలో....

స్థానిక డాక్టర్ శ్యామ్యూల్ జార్జి ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలోని విశ్వేశ్వరయ్య కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి స్మరించుకున్నారు. ఇంజనీర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల టెక్నికల్ అడ్వైజర్, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్, అడ్వైజర్ డాక్టర్ ఆదిమూలపు సతీష్, కార్యదర్శి ఆదిమూలపు విశాల్ మాట్లాడారు. ఇంజినీర్ల మేధోసంపత్తికి దర్పణంగా రూపుదిద్దుకున్న నిర్మాణాలు దేశ ప్రగతికి ప్రతీకలన్నారు. అనేక నిర్మాణాలను జాతికి అందించి దేశంలోని అనేక ప్రాంతాలు సుభిక్షంగా తులతూగడానికి కారణమైన మహనీయుడు మోక్షగుండం విశ్వేశ్వరయ్య అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్.రాజబాబు, అకడమిక్ డీన్ డాక్టర్ మస్తానయ్య, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరా ఇంజినీరింగ్ కళాశాలలో...

స్థానిక ఇందిరా ఇంజినీరింగ్ కళాశాలలో కళాశాల చైర్మన్ వెన్నా హనుమారెడ్డి ఆధ్వర్యంలో ఇంజినీర్స్ డే వేడుకలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాల వేసి స్మరించుకున్నారు. ఈ సందర్భంగా హనుమారెడ్డి మాట్లాడుతూ దేశానికి రాబోయే రోజుల్లో వ్యవసాయం, పరిశ్రమలే అవసరమని గుర్తించిన విశ్వేశ్వరయ్య వాటిని వృద్ధిలోకి తీసుకురావడం కోసం తీవ్రంగా శ్రమించిన వ్యక్తి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కందుల రాజశేఖరరెడ్డి పాల్గొన్నారు.

ఏ1 గ్లోబల్ ఇంజినీరింగ్ కళాశాలలో....

మార్కాపురం సమీపంలోని దరిమడుగు గ్రామం వద్దగల ఏ1 గ్లోబల్ ఇంజినీరింగ్ కళాశాలలో ఇంజినీర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్ర పటానికి కళాశాల చైర్మన్ డాక్టర్ మీర్జా షంషీర్‌అలిబేగ్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీధర్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

రూ.1.70 లక్షలు పలికిన వినాయకుడి లడ్డు

ప్రజాశక్తి-టంగుటూరు

వినాయక చవితి వేడుకల్లో భాగంగా టంగుటూరి మండలం కందులూరు గ్రామంలో కాకతీయ కమ్మ సేవా సంఘం ఆధ్వర్యంలో వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఆదివారం నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా లడ్డుకు వేలం పాట నిర్వహించారు. గ్రామానికి చెందిన ఉప్పుటూరి సునీల్ 25 కిలోల లడ్డును వేలం పాటలో రూ.1,70,000 దక్కించుకున్నాడు. మరో 11 కిలోల లడ్డును దామచర్ల గాయిత్రి వేలం పాటలో రూ.లక్షల రూపాయలకు దక్కించుకున్నారు. నిమజ్జనం సందర్భంగా వినాయక విగ్రహానికి గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు.



వేలంలో లడ్డును దక్కించుకున్న సునీల్

తల్లి చెంతకు చేరిన చిన్నారి

ప్రజాశక్తి-టంగుటూరు

నెల్లూరు జిల్లా విడవలూరు మండలం మధువర్తి గ్రామానికి చెందిన మహాలక్ష్మి, వరంగల్ జిల్లా గోవిందరావు పేట మండలం ములుగు గ్రామానికి చెందిన రాజు ఎనిమిదేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. వారికి ఒక పాప అక్షయ ఉంది. ఇటీవల మహాలక్ష్మి ఓ శుభ కార్యక్రమంలో పాల్గొనేందుకు తమ స్వగ్రామమైన మధువర్తికి వచ్చింది. అనంతరం తమ అమ్మమ్మ ఇంటి వద్ద కొన్ని రోజులు ఉండి వస్తానని చెప్పి హైదబాద్ వెళ్లింది. ఎంతకీ తిరిగి రాకపోవడంతో రాజు తన భార్య మహాలక్ష్మికి ఫోన్ చేశాడు. ఆమె సమాధానం సరిగా చెప్పలేదు. అనంతరం మహాలక్ష్మి మధువర్తి వచ్చింది. దీంతో రాజు అక్కడి వెళ్లాడు. ఇద్దరికి మధ్య గొడవ చోటు చేసుకుంది. ఈ క్రమంలో ఎవరికి చెప్పకుండా ఆదివారం అక్షయను తీసుకొని తమ స్వగ్రామానికి బయలు దేరాడు. అందిన సమాచారం మేరకు శింగరాయకొండ సిఐ హాజరత్తయ్య, టంగుటూరు ఎస్ఐ నాగ మల్లేశ్వరరావు టంగుటూరు టోల్ ప్లాజా వద్ద బస్సును ఆపి రాజు, అక్షయను దింపారు. అనంతరం రాజు బావమరిది పూర్ణచంద్ర రావును పిలిపించి ఇద్దరికి కౌన్సిలింగ్ ఇచ్చారు. అనంతరం అక్షయ, రాజు, పూర్ణచంద్రరావును మధువర్తి గ్రామానికి పంపారు.



పోలీసుల అదుపులోఉన్న చిన్నారి అక్షయ్య

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

మృతదేహాన్ని బావిలో పడేసిన వైనం

ప్రజాశక్తి-కొండపి

విద్యుత్ షాక్‌తో మృతి చెందిన వ్యక్తి మృతదేహాన్ని బావిలో పడేసిన ఘటన మండల పరిధిలోని మూగచింతల గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ కృష్ణబాజి తెలిపిన వివరాల ప్రకారం... మూగచింతల గ్రామానికి చెందిన మన్నెం వెంకటేశ్వర్లు(34) శనివారం రాత్రి ఇంటి నుంచి బటయకు వెళ్లాడు. ఆదివారం ఉదయం వరకూ వెంకటేశ్వర్లు తిరిగి ఇంటికి రాలేదు. ఈ క్రమంలో మృతుడి భార్య సీతమ్మ ఈ విషయం గురించి కుటుంబ సభ్యులకు, బంధువులకు తెలిపింది. అందరూ కలిసి వెంకటేశ్వర్లు ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో అదే గ్రామానికి చెందిన ఆనాల కృష్ణయ్య, రమణయ్య, మరో ముగ్గురు గ్రామస్తులకు ఫోన్ చేసి వెంకటేశ్వర్లు విద్యుత్ షాక్‌తో మృతిచెందడంతో మృతదేహాన్ని పక్కనే ఉన్న బావిలో పడవేసినట్లు తెలిపారు. గ్రామస్తులు బావి వద్దకు వెళ్లి వెంకటేశ్వర్లు మృత దేహాన్ని బయటకు తీశారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ కృష్ణబాజి, పోలీసు సిబ్బంది ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఆనాల కృష్ణయ్య, రమణయ్య మరో ముగ్గురిని అదుపులోకి తీసుకొని విచారించారు. శనివారం రాత్రి అడవి పందుల కోసం పొలాల చుట్టు విద్యుత్ తీగలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆదివారం ఉదయం పొలాల వద్దకు వెళ్లి సరికి వెంకటేశ్వర్లు మృతి చెంది ఉన్నట్లు తెలిపారు. తాము బయపడి మృతదేహాన్ని బావిలో పడవేసినట్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మృతదేహాన్ని బయటకు తీస్తున్న గ్రామస్తులు

రూ.65,001 పలికిన వినాయకుడి లడ్డు

ప్రజాశక్తి-చీమకుర్తి

వినాయక చవితి వేడుకల్లో భాగంగా స్థానిక గాంధీనగర్ రెండోలైన్‌లో వినాయకుడి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఆదివారం నిమజ్జనం నిర్వహించారు. ఈ సందర్భంగా వినాయకుడి లడ్డుకు వేలం పాట నిర్వహించారు. సూది శ్రీనివాసరావు రూ.65,001 వేలం పాటలో లడ్డును దక్కించుకున్నాడు.

అదుపు తప్పి ఆటోబోల్తా డ్రైవర్ మృతి

ప్రజాశక్తి-పెద్దారవీడు

గేదెను తప్పించబోయి అదుపుతప్పి ఆటో బోల్తా కొట్టిన ఘటనలో ఓవ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని తోకపల్లి వెలిగొండ ప్రాజెక్టు పునరావస కాలనీ సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో మార్కాపురంలోని డ్రైవర్స్ కాలనీకి చెందిన ఆటో డ్రైవర్ మంగమూరి బ్రహ్మయ్య (47) మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జూదరులు అరెస్టు

ప్రజాశక్తి- గిద్దలూరు రూరల్

మండల పరిధిలోని గుమ్మలపల్లె గ్రామ సమీపంలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై సిఐ సురేష్ పోలీసు సిబ్బందితో కలిసి ఆదివారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా పేకాట ఆడుతున్న ఏడుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు.వారి వద్ద నుంచి రూ.3,750 నగదును స్వాధీనం చేసుకున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం


ప్రజాశక్తి-కంభం రూరల్

కంభం చెరువు సమీపంలో రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని మతదేహం ఆదివారం లభ్యమైంది. రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మతదేహాన్ని పరిశీలించారు. గుర్తుతెలియని వ్యక్తి రైలు నుంచి జారిపడి మతి చెందాడా లేదా ఆత్మహత్య చేసుకున్నాడా అనే కోణంలో రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు

ఇసుక ట్రాకర్లు పరిశీలన

ప్రజాశక్తి-టంగుటూరు

జరుగుమల్లి మండల పరిధిలోని వావిలేటిపాడు వద్ద ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎ. కిరణ్ ప్రభాకర్ ఆదివారం తనిఖీ చేశారు. డ్రైవర్ల వద్ద ఇసుక తరలింపునకు సంబంధించిన అనుమతి పత్రాలను పరిశీలించారు. మైన్స్ ఏడీ జగన్నాథరావు వద్ద నుంచి తమకు నుంచి ఇసుక తరలింపునకు తాము అనుమతి పత్రాలు పొందినట్లు డ్రైవర్లు తెలిపారు. ఆదివారం ఇసుక తరలింపునకు అనుమతి ఉందా అని పరిశీలించారు. అనంతరం అనుమతి పత్రాలను తన వెంట తీసుకెళ్లారు. కొందరు టంగుటూరు, జమ్ములపాలెం గ్రామాలకు ట్రాక్టర్లలో ఇసుక ధరలించి ట్రక్కు రూ.3,500 వంతున విక్రయిస్తున్నారు.



చిన్నారిని ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్

చిన్నారి నామకరణ వేడుకల్లో ఎమ్మెల్యే

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

మండల పరిధిలోని అమ్మనబ్రోలు గ్రామానికి చెందిన తెలుగు యువత నాయకుడు వీరగంధం దేవేంద్రనాథ్ చౌదరి కుమార్తె నామకరణ వేడుకలు చదలవాడ శివాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ వేడుకల్లో సంతనూతలపాడు ఎమ్మెల్యే బిఎన్. విజయకుమార్ పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పిడిసిసి బ్యాంకు మాజీ చైర్మన్ ఈదర మోహన్ , మండవ మురళీ కష్ణ, పొగాకు ఉత్పత్తి దారుల సమైఖ్య మాజీ అధ్యక్ష్యుడు మారెళ్ల వెంకట శేషయ్య , ఒంగోలు మున్సిపల్ మాజీ చైర్మన్ యక్కల తులసీరావు, మద్దినేని హరిబాబు , కాకర్ల లక్ష్మి వరప్రసాద్ , దివి పున్నారావు , గూడూరి ఝాన్సీ, ఉప్పుటూరి హరినాథ్ , బ్రహ్మారాజు పాల్గొన్నారు.

హయ్యర్‌బస్ డ్రైవర్ల వేతనాలు పెంచాలి: సిఐటియు

ప్రజాశక్తి - రేపల్లె

ఎపిఎస్ ఆర్టీసీ ప్రైవేట్ హైర్ బస్ డ్రైవర్ల వేతనాలు పెంచాలని, బస్ పాస్‌లు ఇవ్వాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ మణిలాల్ డిమాండ్ చేశారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో రేపల్లె ఆర్టీసీ డిపో పరిధిలో పనిచేస్తున్న ప్రైవేట్ హైర్ బస్ డ్రైవర్లు, వర్కర్ల యూనియన్ సమావేశం ఆదివారం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ డిపో పరిధిలో హైర్ బస్ డ్రైవర్లు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా డ్రైవర్లకు వేతనాలు పెంచాల్సి ఉన్నప్పటికీ పెంచలేదని అన్నారు. గత వేతన ఒప్పందం ముగిసి 6నెలలు గడిచిందని తెలిపారు. రేపల్లె డిపో పరిధిలో వేతనాలు పెంపుదల కోసం యజమానులకు యూనియన్‌గా వినతి పత్రాలు అందజేస్తామని తెలిపారు. సానుకూలంగా స్పందించి వేతనాలు పెంచేందుకు యజమానులు పూనుకోవాలని కోరారు. లేని పక్షంలో ఆందోళన నిర్వహిస్తామని అన్నారు. ఒక్కో బస్సుకు ఇద్దరు డ్రైవర్లకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న జిఒ ప్రకారం బస్ పాసులు ఇవ్వాలని కోరారు. యజమానులు డ్రైవర్లకు ఉద్యోగభద్రత కల్పించే విధంగా వ్యవహరించాలని అన్నారు. బస్ రిపేర్లప్పుడు, ప్రమాదాలు జరిగిన సందర్భంలో డ్రైవర్లకు వేతనం, ఖర్చులు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మదర్ థేరిస్సా హైర్ బస్ యూనియన్ నాయకులు ఎల్ వెంకట్, సుబ్రహ్మణ్యం, భాను, ఇమ్రాన్, సాయి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు అధ్యక్షులు మణిలాల్



జెండా ఆవిష్కరిస్తున్న సిపిఎం నేతలు

సిపిఎం కార్యదర్శిగా రాంబాబు

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

సిపిఎం మార్టూరు గ్రామ కార్యదర్శిగా ఎనికపాటి రాంబాబును ఏకగ్రీవంగా ఎంపికచేసినట్లు ప్రాంతీయ కార్యదర్శి బత్తుల హనుమంతరావు తెలిపారు. స్థానిక సిఐటియు కార్యాలయం వద్ద సిపిఎం గ్రామ మహాసభ సీహెచ్ మజుందార్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. మార్టూరులో ఎక్స్‌ప్రెస్ హై వే బ్రిడ్జికి ఆనుకోని రెండు ప్రక్కల ఏర్పాటు చేసిన సర్వీస్ రోడ్డు అద్వాన్నంగా తయారైందని అన్నారు. ఒంగోలు వైపు నుండి చిలకలూరిపేట వైపు వెళ్లే సర్వీస్ రోడ్డులో పరిమితికి మించి స్పీడ్ బేకర్లు ఏర్పాటు చేయడంతో ఆర్టీసీ బస్సులు మార్టూరు గ్రామంలోకి వెళ్లకుండా బ్రిడ్జి మీదుగా వెళుతున్నాయని అన్నారు. దీంతో ప్రయాణికులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. బైకులపై వెళ్లే వాహన దారులు రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారని అన్నారు. హై వే అధికారులు స్పందించి రెండు వైపులా ప్రమాదాలు జరగకుండా సర్వీస్ రోడ్డుని బాగు చేయాలని కోరారు. గ్రామంలో ప్రతి రోజు మంచి నీరు కుళాయిల ద్వారా నీళ్ల సరఫరా చేయాలని అన్నారు. డ్రైనేజీ వ్యవస్థ మెరుగు పరచాలని కోరారు. మండలంలోని జగనన్న కాలనిల్లో రోడ్లు ఏర్పాటు చేసి, డ్రైనేజీ కాలువలు నిర్మించాలని తీర్మానించారు. కార్యక్రమంలో బొడెంపూడి సూరిబాబు, మొగల్ ఇబ్రహీం పాల్గొన్నారు.

లంక గ్రామాలలో డ్రైనేజీ నిర్మించాలి

ప్రజాశక్తి - కొల్లూరు

లంక గ్రామాలకు శాశ్వత డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలని కోరుతూ మండలంలోని పోతర్లంక నుండి జువ్వలపాలెం వరకు ఆటోలో ఆదివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వేములపల్లి వెంకటరామయ్య మాట్లాడారు. లంక గ్రామాల్లో కొద్దిపాటి వరదలు వచ్చిన పొలాల్లో నీరు నెలల తరబడి నిల్వ ఉంటుందని అన్నారు. ఆ మురుగు నీరు బయటకు పోయే మార్గాలు చూడాలని, లేని పక్షంలో పంటపొలాలు అధిక వర్షం వరదల వలన నీరు నిలువ ఉండి వాణిజ్య పంటలైన కూరగాయలు, పసుపు, కంద, అరటి మొదలైన పంటలు దెబ్బతిన్నడం వలన రైతులు పూర్తిగా నష్టపోయి ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారని అన్నారు. డ్రైనేజీ వ్యవస్థపై గతంలో 2010లో అక్టోబర్ నెలలో వెల్లటూరు లో దీనిపై నిరాహార దీక్ష చేయడం వలన అప్పుడు అధికారులు స్పందించి సర్వే నిర్వహించి ఒక రిపోర్ట్ ఇచ్చారు. దాని ఆధారంగా డ్రైనేజీ ఏర్పాటు చేయాలని కోరారు. దీని సందర్భంగా ఈ నెల 16న సోమవారం కిష్కిందపాలెంలో గాంధీ బొమ్మ సెంటర్ వద్ద జరిగే సదస్సుకు రైతులందరూ రావాలని కోరారు. కార్యక్రమం లో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు టి కృష్ణమోహన్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు బొనిగల సుబ్బారావు, కౌలు రైతు సంఘం నాయకులు జి నాగరాజు, మనోజ్ పాల్గొన్నారు.



శాశ్వత డ్రైనేజీ ఏర్పాటు చేయాలన్న రైతు సంఘం నాయకులు



బాధితులకు సహాయం చేస్తున్న పోలీసు అధికారి గణపతి

పోలీసు అధికారుల సంఘం సాయం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

ఆంధ్రప్రదేశ్ పోలీస్ అధికారుల సంఘం సలహాదారులు అద్దేపల్లి గణపతి ఆధ్వర్యంలో కృష్ణానది వరద బాధితులైన చింతమొటు, గుంటూరు గూడెంలో నిత్యవసర సరుకులు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా అద్దెపల్లి గణపతి మాట్లాడుతూ పోలీసులు కృష్ణానది వరద ముంపు గ్రామాల్లో రాత్రింబవళ్లు విధులు నిర్వహిస్తున్నారని అన్నారు. తమ వంతు సహాయంగా వరద బాధితులను ఆదుకోవాలనే గొప్ప మనసుతో ఈ కార్యక్రమం చేపట్టడం అభినందనీయం అన్నారు. ఎప్పుడు ఇలాంటి సహాయాలు చేస్తూనే ఉన్నామని అన్నారు. సహాయం చేసే విషయంలో అందరికంటే ముందు ఉంటామని అన్నారు. తమకు ఆపద ఉందని తెలిసినా వారికి ఎప్పుడు వెన్నంటి ఉంటామని అన్నారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తామని అన్నారు. కార్యక్రమంలో ఆరో బెటాలియన్ ఆర్ఎస్ఐ భుజంగరావు, బాబు, జగన్నాధరావు, మన్మధరావు, ఎఆర్ ఎస్ఐ పాపారావు, హెడ్ కానిస్టేబుల్ సోమరాజు పాల్గొన్నారు.



ఎలక్ట్రికల్ ఎడిని సత్కరిస్తున్న రోటరీ ప్రతినిధులు

రోటరీ ఆధ్వర్యంలో ఇంజనీర్స్ డే

ప్రజాశక్తి - అద్దంకి

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఇంజనీర్స్ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎలక్ట్రికల్ ఎఇ వి బాలకోటేశ్వరరావు నివాసంలో రోటరీ అధ్యక్షులు చప్పిడి వీరయ్య కేక్ కట్ చేసి భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జాతికి చేసిన సేవలను కొనియాడారు. పుట్టంరాజు శ్రీరామ చంద్రమూర్తి మాట్లాడుతూ ఇంజనీర్లు ప్రాజెక్టులు నిర్మించక పోతే మనకు ఆహారం కొరత ఏర్పడే దని పేర్కొన్నారు. మురళీ సుధాకరరావు మాట్లాడుతూ బాలకోటేశ్వరరావుని ఎల్లపుడు చిరునవ్వుతో సేవలంది స్తారని పేర్కొన్నారు. ఎలక్ట్రికల్ ఇంజనీర్ బాలకోటేశ్వరరావు దంపతులను పూలమాల జ్ఞాపికతో సత్కరించారు. బాల కోటేశ్వరరావు మాట్లాడుతూ గతంలో మానవుడికి రొటీ, కపడా, మకాన్ అనే మూడు తప్పని అవసారైలైతే ఇప్పుడు మానవుడికి విద్యుత్ కూడా నాలుగో నిత్యావసరమై నదని పేర్కొన్నారు. ఇంజనీర్స్ డే సందర్భంగా తనను సత్కరించిన రొటేరియన్లకు కృతజ్ఞతలు తెలిపారు. రోటరీ ట్రెజరర్ మాలాది శ్రీనివాసరావు, సందిరెడ్డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

20న పాలిటెక్నిక్ కాలేజీలో జాబ్‌మేళా

ప్రజాశక్తి - అద్దంకి

నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఉపాధి కార్యాలయం, సిడాఫ్ సంయుక్తంగా ఈనెల 20న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు నైపుణ్యాభివృద్ధి జిల్లా అధికారి ఈ తమ్మాజీరావు తెలిపారు. మాస్టర్ మైండ్స్, కెఎల్ గ్రూప్, కళ్యం టెక్స్‌టైల్స్ కంపెనీలు హాజరవుతున్నాయని తెలిపారు. 90కిపైగా ఖాళీలు ఉన్నాయని, విద్యార్హత, నైపుణ్యం ఆధారంగా నెలకు రూ.10వేల నుండి రూ.18వేల వరకు ఉంటుందని తెలిపారు. అదనపు సమా చారం కోసం 99888 53335 సంప్రదించవచ్చని తెలిపారు.

విద్యార్థులకు నోటుపుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి - అమృతలూరు

మండలంలోని మోపర్రు గ్రామంలోని ఎఆర్సి హాస్టల్ విద్యార్థులకు ఉపాధ్యాయిని చిగురుపాటి శిరోమణి జ్ఞాపకార్థం మాజీ ఎంపీపీ మైనేని రత్న ప్రసాద్ ఆర్థిక సహకారంతో నోట్ పుస్తకాలు, పెన్నులు, పౌష్టికాహారం హాస్టల్ నిర్వాహకులు పల్లెకొండ రాజుకు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా రత్నప్రసాద్ మాట్లాడుతూ చిగురుపాటి శిరోమణి అందరికీ విద్య అందుబాటులో ఉండాలనే సదుద్దేశంతో అందరూ చదువుకొని విజ్ఞానం పెంచుకోవాలని తన భర్త కమ్యూనిస్టు నాయకుడు పరుచూరి నాగేశ్వరరావు జ్ఞాపకార్థం అమృతలూరు గ్రంథాలయంలో ప్రత్యేక రీడింగ్ రూం నిర్మించారని అన్నారు. నెల్లూరు ప్రజా వైద్యశాలలో పనిచేస్తున్న ఆమె కుమారుడు డాక్టర్ అజయ్ ప్రజలకు ఎంతో సేవ చేస్తున్నట్లు పేర్కొన్నారు. దాతలు అందించే సహాయ సహకారాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సిపిఎం వేమూరు కార్యదర్శి బొనిగల ఆగస్టీన్ మాట్లాడుతూ శిరోమణి టీచర్ తన భర్త, సిపిఎంలో పూర్తి కాలం పని చేయడానికి, కుమారుడు డాక్టర్ అజయ్ నెల్లూరు ప్రజా వైద్య శాలలో పని చేయడానికి ఎంతో సహకరించారని అన్నారు. ఆమెకు డబ్బుపై వ్యామోహం లేదని అన్నారు. పార్టీ కార్యకర్తలు ఇంటికి వస్తే కుటుంబ సభ్యులుగా చూసే వారని కొనియాడారు. ఆమె పేరుతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు కొత్తపల్లి మాధవరావు, మల్లిపెద్ది సర్వోజి, యలవర్రు మాజీ సర్పంచ్ ఇంటూరి విజయభాస్కర్, పరుచూరి శంకర్, నక్కా పార్వతి పాల్గొన్నారు.



పుస్తకాలు అందజేస్తున్న సిపిఎం నాయకులు ఆగస్టిన్



ఔషధ మొక్కలు పంపిణీ చేస్తున్న మహిళా మండలి

బాధితులకు చేయూతనివ్వటం హర్షనీయం

ప్రజాశక్తి - చీరాల

భారీ వర్షాల కారణంగా విజయవాడ కృష్ణానది పరివాహక ప్రాంతాల్లో ముంపుకు గురైన వివిధ గ్రామాల బాధితులను ఆదుకోవటం అందరి బాధ్యతని శాసన సభ్యులు మద్దులూరి మాలకొండయ్య అన్నారు. విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధికి జమ చేసేందుకు వల్లంపట్ల మురళి కృష్ణ మూర్తి రూ.15,116, గట్టా రమేష్ రూ.10116 విరాళంను అందజేశారు. వరద బాధితులకు చేయూత అందించడం పట్ల అభినందించారు.



ఎంఎల్ఎ కొండయ్యకు విరాళం అందిస్తున్న యువకులు

రైతులకు ఔషధ మొక్కలు పంపిణీ

ప్రజాశక్తి - అద్దంకి

స్వయం జ్యోతి మహిళా మండలి ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ఔషధ మొక్కల బోర్డు సహకారంతో బొమ్మనంపాడు, చెరువుకొమ్ముపాలెం గ్రామాల్లోని 200 మంది రైతులకు ఉచితంగా ఎర్రచందనం, రణపాల, ఉసిరి, తమలపాకు, ఇన్సులిన్ ప్లాంట్, నల్లేరు, నిమ్మగడ్డి మొక్కలను ఆదివారం ఉచితంగా పంపిణీ చేశారు. అనంతరం స్వయం జ్యోతి మహిళా మండలి సమన్వయకర్త బి కీర్తన ఔషధ మొక్కల ఉపయోగాల గురించి వివరించారు. రిసోర్స్ పర్సన్ కిరణ్ చంద్, శర్మ, ఔషధ మొక్కల గిట్టుబాటు ధర, వివిధ రాష్ట్రాల్లో, ఇతర దేశాల్లో ఔషధ మొక్కలకు ఉన్న డిమాండ్, వివిధ కంపెనీ అడ్రస్సులతో సహా రైతులకు తెలిపారు.

సీతారాం ఏచూరికి ఘన నివాళి

ప్రజాశక్తి-చీమకుర్తి

సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి ఘన నివాళులర్పించారు. మండలంలోని మర్రిచెట్లపాలెం సెంటర్‌లో ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు పల్లాపల్లి ఆంజనేయులు, వీరెపల్లి వెంకయ్య, నుగ్గుశ్రీను,జి ప్రభుదాసు, చెన్నకేశవులు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.అదేవిధంగా మండల పరిధిలోని జివిఎల్‌పురంలో సిపిఎం మండల కార్యదర్శి పి.వెంకటరావు,మండల నాయకులు కొల్లూరి వెంకటేశ్వర్లు, నాయకులు నల్లూరి కోటయ్య, బసవయ్య,ఎస్.వెంకటేశ్వర్లు,ప్రభుదాసు ఏచూరి చిత్ర పటానికి పూలమాలుల వేసి నివాళులర్పించారు.

కొండపి : సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంతాప సభ సిపిఎం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సభకు సిపిఎంఎల్(న్యూడెమోక్రసీ) మండల నాయకుడు వై. చంద్రశేఖర్ అధ్యక్షత వహించారు. తాటాకుల పాలెం గ్రామ సర్పంచి ఎం.వన్నూర్ సాహెబ్ సీతారాం ఆధ్వర్యంలో ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి కెజి.మస్తాన్ మాట్లాడుతూ దేశరాజకీయాల్లో తనదైన ముద్రవేసిన సీతారాం ఏచూరి మతి కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటని పేర్కొన్నారు. కోవూరు శంకర్, ముప్పరాజు బ్రహ్మయ్య, గడ్డం వందనం, మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ ఓ పోరాట యోధుడిని కోల్పోయినట్లు తెలిపారు. ప్రజా సమస్యలపై నినదించిన సీతారాం ఏచూరి గళం మూగపోయిందని పేర్కొన్నారు. నివాళు లర్పించిన వారిలో వై. రూబేన్, రాజబాబు , దగ్గుమాటి జయ రావు ,ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.


చీమకుర్తిలో నివాళులర్పిస్తున్న నాయకులు


కొండపిలో నివాళులర్పిస్తున్న నాయకులు

ఒంగోలు సబర్బన్ : కొప్పోలులోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సిపిఎం ఆధ్వర్యంలో సీతారాం ఏచూరికి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏచూరి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో శింగమనేని హనుమంతరావు, మధిర ఆదినారాయణ, బొడపాటి రాఘవరావు, పాటూరి ఆధిశేషు, ముచ్చు వెంకటరావు, అంజిరెడ్డి, గంగాడి నాగేశ్వరావు, కోడెల కోటయ్య, గాదె లక్ష్మారెడ్డి, ఘట్టంనేని శ్రీనివాసరావు, దమ్మాలపాటి వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

వరద బాధితులకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-చీమకుర్తి : విజయవాడ వరద బాధితుల సహాయార్థం ప్రవాస భారతీయుడు, నల్లూరి పౌండేషన్ ,నాల్‌సాఫ్ట్ అధినేత నల్లూరి వెంకటశేషయ్య భారీ వితరణ అందించారు. లోతట్టు ప్రాంతాలలో పూర్తిగా నిర్వాసితులైన బాధిత స్త్రీ, పురుషులకు 300 వేలదుస్తుల కిట్లు అందజేశారు. విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా దుస్తుల కిట్ల పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా నల్లూరి వెంకటశేషయ్యను చంద్రబాబు అభినందించారు. టిడిపి అధికార ప్రతినిధి పట్టాభి, నాల్‌సాఫ్ట్ ,నల్లూరి పౌండేషన్ ప్రతినిధులు ఇంటింటికి తిరిగి దుస్తుల కిట్లను పంపిణీ చేశారు.


దుస్తుల క్విట్ల పంపిణీని ప్రారంభిస్తున్న పిఎం చంద్రబాబు

విరాళాలు సేకరణ

ప్రజాశక్తి-టంగుటూరు

టంగుటూరు మండలం ఎం. నిడమానూరు గ్రామంలో టిడిపి గ్రామ ఉపాధ్యక్షుడు కాకుమాని సుబ్బారావు ఆధ్వర్యంలో విజయవాడ వరద బాధుల సహాయార్థం ఆదివారం విరాళాలు సేకరించారు. మొత్తం రూ.1,40,000 విరాళాల రూపంలో వసూలు అయ్యింది. గ్రామానికి చెందిన టిడిపి నాయకులు బోడపాటి అంజిబాబు రూ.60,000 విరాళం అందజేశారు. మొత్తం రూ.2లక్షల రూపాయలను సిఎం రిలీఫ్ ఫండ్‌కు చెక్కు రూపంలో అందజేయనున్నట్లు నాయకులు తెలిపారు. ఈకార్యక్రమంలో ఎస్‌సి సెల్ మండల ప్రధాన కార్యదర్శి పిడుగురాళ్ళ సురేష్ బాబు, గ్రామ టిడిపి కార్యకర్తలు మన్నెం ఆదినారాయణ, కుక్కపల్లి రమణయ్య, మేడంపూడి లక్ష్మీనారాయణ, పిడుగురాళ్ళ రవి, ఐనంపూడి రవీంద్ర, మద్దులూరి రవి, పిడుగురాళ్ళ నరశింహంపాల్గొన్నారు.

వినాయక నిమజ్జనాలతో సందడి

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ మండలం పాకల తీరం వద్ద గణేష్ విగ్రహాల నిమజ్జనంతో సందడి నెలకొంది. ఆదివారం మొత్తం 203 విగ్రహాలను నిమజ్జనానికి తీసుకొచ్చినట్లు పోలీసులు తెలిపారు. ట్రాక్టర్లు, లారీలపై విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు. విగ్రహాల నిమజ్జనం సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఒంగోలు అడిషనల్ ఎస్‌పి (క్రైమ్) శ్రీధర్‌బాబు పాకల తీరానికి విచ్చేసి బందోబస్తును పరిశీలించారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా వినాయక నిమజ్జనం చేసుకోవాలని ప్రజలకు సూచించారు. అడిషనల్ ఎస్‌పి వెంట సిఐ హాజరత్తయ్య, ఎస్ఐ టి.శ్రీరామ్, బి.మహేంద్ర. మెరైన్ పోలీసు సిబ్బంది ఉన్నారు.


నిమజ్జనం కోసం పాకల తీరానికి తీసుకొచ్చిన వినాయక విగ్రహాలు


ఉప్పుగుండూరులో గణేష్ ఊరేగింపు


కొప్పోలులో నిమజ్జనం వేడుకల్లో పాల్గొన్న బాలభక్తులు

నాగులుప్పలపాడు :వినాయక చవితి పండగ సందర్భంగా మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణనాధ విగ్రహాలకు 9 రోజుల పాటు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం విగ్రహాలను సుందరంగా అలంకరించి నిమజ్జనానికి తరలించారు. ఉప్పు గుండూరులోని ఉత్తరం బజారులో తెలుగు యువత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విగ్రహం వద్ద లడ్డూ ప్రసాదానికి వేలం పాట నిర్వహించారు. సామినేని కష్ణ రూ.60 వేలకు లడ్డూ ప్రసాదాన్ని వేలం పాటలో దక్కించుకున్నారు. దత్తసాయి కోల్డ్ స్టోరేజి , పురుషోత్తమ కాలనీ, వివిధప్రాంతాల్లోని చిన్నారులు ఏర్పాటు చేసిన ఏడు గణనాధ విగ్రహాలకు అత్యంత వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం చిన్నగంజాం మండలం పెద గంజాం వద్ద సముద్రతీరానికి తరలించి నిమజ్జనం చేశారు.

ఒంగోలు సబర్బన్ : వినాయక చవితి వేడుకల్లో భాగంగా ఒంగోలు నగర పరిధిలోని కొప్పోలు గ్రామంలో బాల భక్తం బృందం ఆధ్వర్యలో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహాన్ని నిమజ్జనానికి తరలించారు. ఈ సందర్భంగా విగ్రహాన్ని సుందరంగా అలంకరించి గ్రామోత్సం నిర్వహించారు. అనంతరం నిమజ్జనానికి తరలించారు. ఈ కార్యక్రమంలో బాలభక్తులు మోక్ష, రాము, ధరణి, కార్తీక్, స్వాతిక్, విఘ్నేష్, హని, మిల్కి, నిత్యా శ్రీనివాస్, చరణ్, కోనంకి శ్రీనివాస్, దీపక్, విరాట్, కమిటీ నిర్వాహకులు తాళ్లూరి చంద్రశేఖర్, పర్వతాల ఆనంద్, గంగాడి శ్రీనివాసులు, గంగాడి అనీల్, యాదాల పవన్, కోనంకి శ్రీకాంత్, ఉన్నం ప్రసాద్, రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టంగుటూరు :వినాయక చవితి వేడుకల్లో భాగంగా స్థానిక రైజ్ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని ఆదివారం నిమజ్జనానికి తరలించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ప్రదర్శించిన కోలాటం ఎంతోగానో ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ శిద్దా హనుమంతరావు, ట్రెజరర్ శిద్దా భరత్ చీఫ్ అడ్వైజర్ శిద్దా ప్రవల్లిక, కళాశాల గౌరవ చైర్మన్ ఇస్కాల రంగమన్నార్ తెలిపారు. విద్యార్థులు, వార్డెన్లు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.


ప్రపంచ ఆర్యవైశ్య మహాసభలో శిద్దా సుధీర్‌కుమార్

ప్రపంచ ఆర్యవైశ్య మహాసభలో శిద్దా సుధీర్

ప్రజాశక్తి-చీమకుర్తి

అబుదాబిలో నిర్వహించిన ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ వామ్ గ్లోబల్‌కన్వేన్షన్-2024లో ఎపి చాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్,యువ పారిశ్రామికవేత్త శిదా సుధీర్‌కుమార్ పాల్గొన్నారు. అబుదాబిలోని నేషనల్ థియేటర్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో శిద్దా సుధీర్‌కుమార్ మాట్లాడారు.ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఆర్యవైశ్యులు అన్ని రంగాలలో రాణించాలన్నారు. యువత ముందుకు రావాలన్నారు. తమవంతు సహకారం అందిస్తామన్నారు. అనంతరం వ్యాపార వేత్తలతో సెమినార్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ నుంచి మాజీ రాజ్యసభ సభ్యులు టిజి. వెంకటేశ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా శిద్దా సుధీర్‌కుమార్‌ను మహాసభ ప్రతినిధులు మెమోంటో, శాలువాతో సత్కరించారు.

విరాళాలు అందజేత

ప్రజాశక్తి -నాగులుప్పలపాడు

విజయవాడ వరద బాధితుల సహాయార్థం మండల పరిధిలోని ఒమ్మెవరం గ్రామంలో టిడిపి నాయకులు ఆదివారం విరాళాలు సేకరించారు. విరాళాలుగా సేకరించిన రూ. 52,116 నగదును సంతనూతలపాడు ఎమ్మెల్యే బిఎన్. విజయకుమార్‌కు ఒంగోలులోని ఆయన నివాసంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెలేఛ్య విజకుమార్ విరాళాలు అందజేసిన వారికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి పాలపర్తి బాలకోటి, టిడిపి గ్రామ అధ్యక్షుడు కొమ్మాలపాటి చిన్న, కాకర్ల లక్ష్మి వరప్రసాద్ తదితరులు ఉన్నారు.

శింగరాయకొండ : విజయవాడ వరద బాధితుల సహాయార్థం మండల పరిధిలోని కనుమళ్ల గ్రామానికి చెందిన మలినేని శింగయ్య రూ. లక్ష రూపాయలు విరాళం అందజేశారు. అదేవిధంగా భైరవనేని మోహన్ రావు రూ.50 వేలు, తన్నీరు యానాది రావు రూ.50వేల కలిపి మొత్తం రూ.2 లక్షలు విరాళం అందజేశారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కూనపరెడ్డి వెంకట సుబ్బారావు, భైరవనేని మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.


హాస్పిటల్‌ను ప్రాంరభిస్తున్న మంత్రి స్వామి

శారద హాస్పిటల్ ప్రారంభం

ప్రజాశక్తి-కొండపి

కొండపి పట్టణంలోని మద్దులూరు రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన శారద హాస్పిటల్‌ను రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కల్లూరి వెంకటేశ్వరరావు, డాక్టర్ వడ్లమూడి అపర్ణ, బత్తుల నారాయణస్వామి, నరసారెడ్డి, తిప్పారెడ్డి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాగర్ కాలువ కట్టలు ఆక్రమణ

◆ కాలవ కట్టపై వ్యవసాయ బోర్ ◆ రైతులకు దారి లేకుండా చేసిన వైనం

ప్రజాశక్తి - పంగులూరు

సాగర్ కాలువలపై అధికారుల పర్యవేక్షణ కరువైంది. దీంతో అక్రమార్కులు కాలువ కట్టలను ఆక్రమిస్తున్నారు. నాగార్జున సాగర్ ప్రాజెక్టు అధికారులు ఏళ్ల తరబడి కాలువలపై తిరగటం లేదనటానికి ఉదాహరణగా ఆక్రమణలు కనిపిస్తున్నాయి. మండలంలోని తూర్పు తక్కెల్లపాడు మైనర్ కాలువ కట్టను కబ్జా చేయడమే కాకుండా నేరుగా కాలవ కట్టపై వ్యవసాయ బోర్ వేయించి ఇతర పొలాల రైతులకు దారి లేకుండా చేశాడు. ఇదేమని ఎవరన్నా అడిగితే వారిపై గొడవ పెట్టుకుంటు న్నాడని పలువురు రైతులు చెబుతున్నారు. మండలంలోని పమిడిపాడు మేజర్ కాలువ కొంత దూరం వచ్చిన తరువాత పంగులూరు మైనర్, తూర్పు తక్కెలపాడు మైనర్ కాలువలుగా చీలి వస్తాయి. తూర్పు తక్కెలపాడు మైనర్ కాలువపై అలవలపాడు గ్రామ పరిధిలోని సర్వే నెంబర్ 75లో తూర్పుతక్కెళ్లపాడు గ్రామానికి చెందిన మర్రి పవన్ కుమార్ అనే వ్యక్తికి భూమి ఉంది. అతని భూమి ప్రక్కగా మైనర్ కాలువ వెళుతుంది. అయితే పవన్ కుమార్ గత నాలుగేళ్లుగా మైనర్ కాలువ గట్టును తన పొలంలో కలుపుకొని పంటలు సాగు చేస్తున్నాడు. అంతే కాకుండా కాలువ కట్ట భూమిలో వ్యవసాయ బోర్ వేసి వ్యవసాయం చేస్తున్నాడు. గతంలో ఈ మైనర్ కాలువ కట్టపైగా రైతుల ట్రాక్టర్లు, ఎద్దుల బళ్ళు, మోటార్ సైకిల్లు వెళ్తుండేవి. రైతులు తమ పొలాల్లో పండించిన పంటలను ఈ కాలువ కట్టమీదుగా ఇళ్లకు తరలించేవారు. ఎరువులు కూడా పొలాలకు ఈ కాలువ గట్టుమీదనే తీసుకెళ్లేవారు. అయితే ఈ కాలువ కట్ట కబ్జాకు గురి కావడం, అందులో పంటలు సాగు చేయటం, బోర్ వెల్ వేయటంతో రైతులకు ఇబ్బంది ఏర్పడుతుందని చెబుతున్నారు. కాలువ కట్ట కబ్జా చేయటం ఏమిటని, తమకు ఇబ్బందిగా ఉందని రైతులంటే వారిపై గొడవకు దిగుతున్నట్లు ఆరోపిస్తున్నారు. నాలుగేళ్లుగా సాగర్ కాలువ గట్టు కబ్జాకు గురైన అధికారులు మాత్రం అటు కన్నెత్తి చూడకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని రైతులు విమర్శిస్తున్నారు. ఈ విషయమై 'ప్రజాశక్తి' ఆ కాలువ బాధ్యతలు చూసే జెఇ విశ్వమోహన్‌ను వివరణ కోరగా సిబ్బంది కొరత కారణంగా కాలువలపై ఏమి జరుగుతుందో తమకు తెలియటం లేదని, పర్యవేక్షణ కూడా తగ్గిందని చెప్పారు. తక్షణమే లస్కర్‌ను పంపి పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కబ్జాకు గురైన సాగర్ కాలువ కట్ట భూమిని కబ్జా నుండి వెంటనే విడిపించి రైతులకు కట్టపై దారి కల్పించాలని, బోర్‌ను తొలగించాలని రైతులు కోరుతున్నారు.



నాగార్జునసాగర్ కాలువ కట్ట ఆక్రమించి దారి మూసేసి వేసిన వ్యవసాయ బోర్

ఇంటిలో మనుషులుండగానే చోరీలు

• ఒకే రాత్రి ఆరు ఇళ్లల్లో దొంగతనాలు • ఆయిల్ మిల్ రోడ్డు చివర బజారులో చోరీ • భయాందోళనలో పట్టణ ప్రజలు

ప్రజాశక్తి - అద్దంకి

ఇంట్లో మనుషులు ఉన్నప్పటికీ దొంగలు తాళాలు పగలగొట్టడంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. పట్టణంలోని 4వ వార్డు ఆయిల్ మిల్ రోడ్డులో ఒకే ఇంటి వరుసలోని మూడు ఇళ్లతో పాటు ప్రక్క ప్రక్కనే మరో మూడు ఇళ్లలో ఒక గదిలో ఇంటి యజమానులు నిద్రిస్తుండగా మరోక గదిలో దొంగలు వారి పని వారు చేసుకుని వెళ్లిన ఘటన శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత జరిగినట్లు బాధితులు తెలిపారు. హిందుస్థాన్ గౌడమ్ వద్ద ఆ చుట్టూ ప్రక్కల ఇళ్లలో ప్రధాన ద్వారాలను పగలగొట్టడంతో పాటు కిటికీలు కూడా వంచి ఇంటిలోకి చొరబడి ఇంటిలోని బీరువాలోని వస్తువులను చిందర వందర చేశారు. మరో ఇంట్లో వెంకటేశ్వర స్వామికి ముడుపు కట్టిన రూ.10వేల నగదును దొంగలు అపహ రించుకొని వెళ్లినట్లు తెలిపారు. ఈ ఘటనతో చుట్టుపక్కల ఇళ్ల ప్రజలు మరింత భయంతో వణికి పోతున్నారు. గతంలో దొంగలు ఇంట్లో ఎవరూ లేని సమయంలో తాళాలు పగలగొట్టి ఇంటిలోని వస్తువులు దోచుకు వెళ్లేవారు. ప్రస్తుతం మరింత బరితెగించి ఇంటిలో అందరూ ఉండగానే తాళాలు పగులగొట్టి చోరీలకు పాల్పడటం ఆందోళన కలిగించింది. ఈ ప్రాంతంలో ఒక సారి దొంగతనం జరిగితే వరుసగా ఏదో ఒక ప్రాంతంలో విరామం లేకుండా దొంగతనాలు జరుగుతున్నాయి. రెండు నెలల నుండి దొంగలు విరామం ఇచ్చి మరలా దొంగ తనాలకు పాల్పడుతున్నారు. పట్టణంలో పోలీసుల పర్యవేక్షణ తగ్గినట్లుగానే ఉందని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. కోవి శ్రీనివాసరావు, సీతారామయ్య, అంకమ్మరావు, రత్తయ్య, సుబ్బారావు తదితరుల ఇళ్లలో ఇంటి తాళాలతో పాటుగా కిటికీలను కూడా ధ్వంసం చేశారు. ఈ సమాచారం స్థానిక పోలీసు స్టేషన్‌కు అందించగా పోలీసులు ఘటనా స్థలాన్ని ఆదివారం పరిశీలించారు. దొంగతనాలు జరిగిన ప్రాంతాల్లోని నివాసులు తప్పనిసరిగా సీసీ కెమెరాలు అమర్చుకుంటే రాత్రి వేళలలో బయట వ్యక్తుల కదలికలను పరిశీలించడానికి అవకాశం ఉంటుందని కాలనీవా సులు చర్చించుకుంటున్నారు. దొంగలు దోచుకుపోవ డానికి ఏమి దొరకనప్పటికీ ఇంటిలోని తినుబండారాలను పూర్తిగా ఆరగించి వెళ్ళినట్లు సంబంధిత బాధితులు చెబుతున్నారు. మునుపెప్పుడు ఇలాంటి ఘటనలు జరగ లేదు. మనుషులు ఇంటిలో ఉండగానే ఇటువంటి ఘటన లు జరుగుతుంటే పట్టణ, పరిసర ప్రాంతా ఇళ్లలో నివసించే కుటుంబాల పరిస్థితి ఏమిటని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ఆయిల్‌మిల్ రోడ్డులో తలుపులు పగులగొట్టిన ఇళ్లు

జగజ్జీవన్‌రామ్ విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి - అమర్తలూరు

మండల కేంద్రంమైన అమర్తలూరులో నూతనంగా నిర్మించిన బాబు జగజ్జివన్‌రావు విగ్రహాన్ని శాసన సభ్యులు నక్కా ఆనందబాబు, బాపట్ల ఎంపీ కృష్ణ ప్రసాద్ ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్శంగా శాసన సభ్యులు ఆనందబాబు మాట్లాడుతూ వర్ధంతి, జయంతులకి విగ్రహాలకు పూల మాల వేసి మర్చిపోకుండ మహనీయుల నుండి స్పూర్తి నేర్చుకోవాలన్నారు. నేటి యువత జగజీవన్‌రామ్ స్పూర్తితో నడవాలి అన్నారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రాజ్యాంగాన్ని రాస్తే జగజ్జీవన్‌రాం సుదీర్ఘకాలం దాని పార్లమెంట్లో కాపాడుకుంటూ వచ్చారని అన్నారు. ఆ రోజున ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొని రాజ్యాంగాన్ని దళితుడైన అంబేద్కర్ రాశాడని, దళితుల హక్కులను రాజ్యాంగంలో పొందుపర్చితే వాటిని 40ఏళ్లపాటు పార్లమెంట్లో పోరాడి దళిత హక్కులు సాధించారని అన్నారు. అప్పట్లో కులాల అడ్డంకులతోనే బాబు జగ్జీవన్ రావు ప్రధానమంత్రి కాలేకపోయారని అన్నారు. ఇప్పటికీ కులాల వివక్షతో దళితులు సమస్యలు, అంటరాని తనం ఎదుర్కొంటున్నారని అన్నారు. అన్ని శాఖల మంత్రిగా జగజీవన్ రామ్ పనిచేశారని అన్నారు. అన్నిట్లో దళితులకు అవకాశాలు కల్పించారని గుర్తు చేశారు. మొట్ట మొదటిసారిగా బాబు జగ్జీవన్ రావ్ విగ్రహాన్ని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైదరాబాదులో విగ్రహావిష్కరణ చేసింది తెలుగుదేశం ప్రభుత్వమే అన్నారు. దళితులకు తెలుగుదేశం ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు. దళితుల హక్కులు, చట్టాలు కాపాపడతామని అన్నారు. ఎంపీ తన్నేటి కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ భారతదేశానికి రాజ్యాంగం లేకపోతే పెద్ద, పెద్ద దేశాల రాజ్యాంగాలను చూసి వాటికన్నా మెరుగుగా భారత దేశ రాజ్యాంగాన్ని రాశారని అన్నారు. అప్పట్లో మిగతా దేశాలు కంటే భారతదేశ రాజ్యాంగమే పెద్దదిగా ఉండేదని అన్నారు. మొట్ట మొదటిసారిగా మహిళలకు ఓటు హక్కు కల్పించింది భారత రాజ్యాంగమేనని అన్నారు.



జగ్జీవన్ రామ్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎంఎల్ఎ, ఎంపి



చిన్నారులకు బహుమతులు అందజేస్తున్న వెంకటరాము

ఆకట్టుకున్న చిన్నారుల భరత నాట్యం

ప్రజాశక్తి - పర్చూరు

స్థానిక అద్దంకమ్మ మాన్యంలో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహం భక్తులను ఆకట్టుకుంది. ఊరేగింపు సందర్భంగా విగ్రహం వద్ద శాతవాహన హైస్కూల్ ఆధ్వర్యంలో చిన్నారులు భరత నాట్యం ప్రదర్శన నిర్వహించారు. కళాకారులకు శాతవాహన హైస్కూల్ కరస్పాండెంట్ తేళ్ల వెంకటరాము ప్రోత్సాహక బహుమతులు అందించినట్లు శ్రీబాల గణేశుని విగ్రహ కమిటీ సభ్యులు తెలిపారు. కొల్లవారిపాలెంకు చెందిన పోట్రు శ్రీనాథ్ చౌదరి లడ్డును రూ.22,500 లకు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా విగ్రహం వద్ద భక్తులకు అన్నదానం చేశారు. విగ్రహాన్ని నిమజ్జనం నిమిత్తం వాడరేవుకు ఆదివారం తరలించారు. కార్యక్రమంలో కొమ్మాలపాటి రవి, కారంపూడి సందీప్ తేజ, సిగనం భాస్కర్, తులసి శ్రీనివాసరావు, తోటా మణి, తులసి రాజా పాల్గొన్నారు.



రూ.25వేలకు గణపతి లడ్డు దక్కించుకున్న చైతన్య

వాడవాడలా వినాయక చవితి ఉత్సవాలు

ప్రజాశక్తి - కర్లపాలెం

బాపట్ల పట్టణంలోవినాయక చవితి ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. పట్టణంలోని 17వ వార్డులో వెంకటేశ్వర స్వామి ఆలయ సమీపంలో స్థానికులు 11 అడుగుల వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. వినాయక విగ్రహం వద్ద కమిటీ సభ్యులు ప్రతిరోజు మహిళలకు వివిధ రకాల క్రీడా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. తొమ్మిది రోజులు పాటు విశేష పూజలు నిర్వహించిన కమిటీ సభ్యులు స్వామివారి లడ్డు వేలం నిర్వహించారు. చైతన్య అనే వ్యక్తి లడ్డును వేలంలో రూ.25వేలకు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామివారి వద్ద తొమ్మిది రోజుల పాటు పూజలు అందుకున్న లడ్డును తాను దక్కించుకోవడం ఆనందంగా ఉందని అన్నారు. అలాగే నిర్వాహకులు భక్తులకు అన్నసంతర్పణ నిర్వహించడం సంతోషమని తెలిపారు. ఎటువంటి లోటుపాట్లు లేకుండా భక్తులకు సేవలందించిన కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమాన్ని వరసిద్ధి వినాయక భక్తి మండలి ఎంతో ఘనంగా ఏర్పాటు చేశారని వచ్చిన ప్రతిభక్తులు, భక్త మండలి సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.



అద్దంకి బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

అధికారుల నిర్లక్ష్యం ప్రయాణికులకు శాపం

ప్రజాశక్తి - ఇంకొల్లు

40 గ్రామాలకు కూడలిగా ఉన్న ఇంకొల్లు బస్ స్టేషన్‌కు అద్దంకి నుండి ఇంకొల్లుకు చందలూరు మీదుగా వచ్చే బస్సులు రెండు మాత్రమే అధికారులు నడుపుతున్నారు. కరోనా వెళ్లిన తర్వాత పూర్తిస్థాయిలో బస్సులు నడపకపోవడంతో ప్రయాణికులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ప్రయాణికులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. వారంలో ఆది, మంగళ, శుక్రవారం రోజుల్లో ఒక బస్సు నిలిపివేస్తున్నారు. ఒక బస్సు మాత్రమే ఈ రూటులో నడుస్తుండడంతో కొనికి, చెందలూరు, తక్కెళ్ళపాడు, కొప్పెరపాడు, అలవలపాడు గ్రామాల ప్రజలు బస్సులు లేకపోవడంతో ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించవలసి వస్తోందని చెబుతున్నారు. అద్దంకి డిపో అధికారుల నిర్లక్ష్యం ప్రయాణికుల పాలిట శాపంగా మారింది. ఆదివారం వస్తే అద్దంకి నుండి బాపట్ల జిల్లా కేంద్రంకు నడిచే బస్సును కూడా అధికారులు నిలిపివేస్తున్నారు. జిల్లా రవాణా అధికారి లేకపోవడంతో పట్టించుకునే అధికారులు లేరు. దూరప్రాంత ప్రయాణికులకు అవసరమైన బస్సులు నడపకపోవడంతో ప్రయాణికులు ప్రైవేటు వాహనాల్ని ఆశ్రయించవలసి వస్తోంది. బస్సులు లేవు అనే సాకుతో అధికారులు తరచూ బస్సులు నిలిపివేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో 850 బస్సులను కిలోమీటర్లు పూర్తయిన లెక్కలు తేల్చి పక్కన పెట్టారు. గ్రామాలకు గతంలో నైట్ హాల్ట్ బస్సులు ఉండేవి. ప్రస్తుతం నైట్ హాల్టు బస్సులు లేకపోవడంతో ఉదయం ఏడు గంటల నుండి గ్రామీణ ప్రాంతాల నుండి బస్సులు బయలు దేరుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు పట్టించుకోని ప్రయాణికులకు రవాణా సౌకర్యం ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ప్రజాశక్తి
7
సోమవారం 16 సెప్టెంబర్ 2024

అడ్డగోలుగా వెలుస్తున్న అక్రమ వెంచర్లు

- ప్రభుత్వ ఆదాయానికి భారీ గండి
- నష్టపోతున్న కొనుగోలు దారులు
- అనుమతులు లేకుండా వెలుస్తున్న వెంచర్లు
- అధికారుల ఆదేశాలను పట్టించుకోని రియల్టర్లు

ప్రజాశక్తి - చీరాల

ఇటీవల అక్రమ లే ఔవుట్లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. ప్రభుత్వ నిబంధనలు పాటించడం లేదు. పంట కాలువలు ధ్వంసం చేశారు. పొలాలకు నీరు అందించే కాలువలు సైతం వదల కుండా వెంచర్లు వేస్తున్నారు. పంట కాల్వలను పూడ్చి వేసి ప్లాట్ల అమ్మకాలు చేస్తున్నారు. దీంతో వెంచర్లకు ఇరువైపులా ఉన్న రైతుల పంటలకు సాగు నీరు అందక రైతులు పెట్టిన పెట్టుబడి చేతికి రాక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆ ప్రాంత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అమాయక ప్రజలనే లక్ష్యంగా చేసుకొని రియల్ ఎస్టేట్ వ్యాపారులు తక్కువ ధరకే ప్లాటు అందిస్తున్నామని ప్లాట్లు అంటగడుతున్నారు. పూర్తి స్థాయి అనుమతులు లేకుండా వెంచర్లు వేయడంతో ఎంతో కష్టపడి వడ్డీలకు తీసుకు వచ్చి మరి ప్లాట్లు కొనుగోలు చేస్తున్న పేద, మధ్య తరగతి అమాయక ప్రజలు తీరా బ్యాంక్ రుణాలకు వెళ్ళటంతో అసలు విషయం తెలిసి మోసపోయినట్లు బాధితులు వాపోతున్నారు.

పంట కాలువ పూడ్చి రియల్ వెంచర్లు

వేటపాలెం మండలం పాపాయిపాలెం రహదారిలో ప్రభుత్వ అనుమతులు లేకుండా వెంచర్లు వెలిసాయి. రైతుల వద్ద పొలాలు కొనుగోలు చేస్తున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులు కనీస ప్రమాణాలు పాటించకుండా ఇష్టా రీతిలో వ్యవహరిస్తున్నారు. వెంచర్లు వేసి ప్లాట్ల అమ్మకాలు చేస్తున్నారు. వెంచర్లలో వేసేందుకు రోడ్డుకు, పొలాలకు మధ్యలో ఉన్న పంట కాల్వలను తూములు వేసి పూడ్చేస్తున్నారు. పలుచోట్ల పూర్తిగా కాలువను పూడ్చివేశారు. దింతో వెంచర్ పక్కన్నే ఉన్న పంట పొలాలకు నీరు అందటం లేదని ఆ ప్రాంతంలోనీ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక రియల్ ఎస్టేట్ వ్యాపారి సర్వే నెంబర్ 206/1, 208/2'ఎ'లో వేసిన వెంచర్‌కు కాలువ పూడ్చివేశారని రైతులు చెబుతున్నారు. అదే విధంగా 802, 806సర్వే నెంబర్లో మరో వ్యాపారి అదే రీతిలో పంట కాలువను ప్రభుత్వ అనుమతి లేకుండా పూడ్చి వేశారు. రియల్ ఎస్టేట్ వెంచర్లతో పంటలకు నీళ్ల అందక నష్టపోవాల్సి వస్తుందని ఇరుగు పొరుగు రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. అక్రమంగా పుట్టగొడుగుల్లా వెంచర్లు వెలుస్తున్న విషయాన్ని రైతులు రెవెన్యూ అధికారులకు పిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోవడం లేదని రైతులు చెబుతు న్నారు. రెవెన్యూ అధికారులు వచ్చినప్పుడు తాత్కాలికంగా పనులు ఆపేసి అధికారులు వెళ్ళిన వెంటనే తిరిగి పనులను చేపడుతున్నారని రైతులు చెబుతున్నారు. 529/2ఎ, 2బి, 2సి, 167/1ఎ, 165,166/3, 221/5 సర్వే నెంబర్లలో ఎలాంటి అనుమతులు లేకుండా వెంచర్లు వేశారు. పెద్ద పెద్ద కంటైనర్లు తిరుగుతూ ఉండటంతో తమ గ్రామంలోని ప్రధాన రహదారి గుంటలుపడి ఇబ్బందులు పడుతున్నామని పాపాయపాలెం రహదారిలోని గ్రామస్థులు అంటున్నారు.



జేసిబి సాయంతో పంట పొలాలు చదును చేసిన వైనం

ప్రభుత్వ నిబంధనలు తూచ్?

రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్రాథమిక నిబంధనలను గాలికి వదిలేశారు. సాధారణంగా వెంచర్లలో పాఠశాల, పార్కు, సామాజిక భవనం వంటి అవసరాలకు 20శాతం నుంచి 40శాతం వరకు స్థలాన్ని కేటాయించాలి. 30అడుగుల విస్తీర్ణంలో రోడ్లను ఏర్పాటు చేయాలి. ఇవన్నీ రికార్డుల్లో ఉన్నట్లు చూపించి క్షేత్రస్థాయిలో మాత్రం సెంటు స్థలం కూడా వదల కుండా రూ.లక్షల్లో విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. మార్కెట్ ధరకు అనుగుణంగా ప్రభుత్వానికి పన్ను చెల్లించకపోవడంతో భవిష్యత్‌లో కొనుగోలు దారులు నష్టపోయే ప్రమాదం ఉందని పలువురు పేర్కొంటున్నారు. పట్టణ పరిసరాల్లో కాస్త తక్కువ ధరకు ప్లాట్లు లభ్యం అవుతున్నాయనే ఆశతో వినియోగదారులు స్థలాలు కొనుగోలు చేస్తున్నారు. భవిష్యత్‌లో భూమి ధరలు పెరుగుతాయని భావించి కొంతమంది పెట్టుబడి పెడుతున్నారు. కాగా రియల్‌ఎస్టేట్ వ్యాపారులు నిబంధనలకు విరుద్ధంగా కొనుగోలు దారుల ఆశలను సొమ్ము చేసుకుంటున్నారు.



అనుమతులు లేకుండా కాలువ పూడ్చి వెంచర్ వేస్తున్న రియల్టర్లు

నిబంధనలు పాటించకుంటే చర్యలు : తహాశీల్దారు పార్వతి

ప్రభుత్వ అనుమతులను లేని రియల్ ఎస్టేట్ వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని వేటపాలెం తహాశీల్దారు పార్వతి పేర్కొన్నారు. నిబంధనలు పాటించల్సిందేనని సూచించారు. పాపాయిపాలెం రహదారిలో అనుమతుల లేకుండా వెంచర్ నిర్మాణాలు జరుగుతున్నాయనే సమాచారం అందిన వెంటనే విఆర్వోను పంపించి నిర్మాణ పనులు నిలిపేశామని అన్నారు. అనధికార లే అవుట్లను గుర్తించి చర్యలు తీసుకుంటామని అన్నారు.



వెంచర్ కోసం పంట కాలువను పూడ్చిన దృశ్యం

కొత్తిమీర సాగులో రైతుకు లాభాల సిరులు

- తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు
- కూరల్లో రుచికి, ఆరోగ్యానికి కొత్తిమీర
- పేదల నుండి ఉన్నతుల వరకు వినియోగం

ప్రజాశక్తి - అద్దంకి

స్థానిక బస్టాండ్ సెంటర్లో ప్రతిరోజూ ఉదయం ఇతర ప్రాంతాల నుండి కొత్తిమీర, పుదీనాతో పాటు వివిధ రకాల ఆకుకూరలు తీసుకువచ్చి అమ్మకాలు చేస్తుంటారు. గంటల వ్యవధిలోనే ఆకుకూరలు అమ్ముడుపోతూ ఉంటాయి. రైతులు కాలంతో సంబంధం లేకుండా పండించే ఆకుకూరల్లో కొత్తిమీర ప్రధానమైనది. అదనపు ఆదాయం ధనియాలు, కొత్తిమీర సాగు చేస్తున్నారు. సాధారణంగా అన్ని వంటకాల్లో కొత్తిమీర వాడతారు. దీనికి మార్కెట్లో నిత్యం డిమాండ్ ఉంటుంది. ధనియాలు, పొడిని కూడా వంటకాల తయారీలో ఉపయోగిస్తున్నారు. తక్కువ కాలంలో కోతకు రావడం, తక్కువ పెట్టుబడి, ఆశించిన మేరకు ఆదాయం లభిస్తుండటంతో కొత్తిమీర సాగుకు చిన్న, సన్నకారు రైతులు ఎక్కువగా ఆసక్తి చూపిస్తున్నారు.

కొత్తిమీర సాగులో మెలకువలు

కొత్తిమీర సాగుకు దాదాపు అన్ని రకాల నేలలు అనుకూలంగా ఉంటాయి. నేల పిహెచ్ విలువ 6.5 – 7.5 ఉండాలి. పంటలో అధికంగా నీరు నిల్వ ఉండటం, అధిక ఎండల వల్ల పంటపై ప్రభావం పడుతుంది. సాధారణంగా తేమతో కూడిన వాతావరణం సాగుకు చాలా అనుకూలం. సాగుకు ముందు నేలను రెండు, మూడు సార్లు దున్నుకోవాలి. తయారీ సమయంలో



రైతులు సాగు చేసిన కొత్తిమీర

ఎకరాకు 10టన్నుల వరకు పశువుల ఎరువులు వేయాలి. పెరుగుతున్న సమయంలో నత్రజని, యూరియా ఎరువులను వేయాలి. విత్తనాలను విత్తుకోవడానికి ముందే చిన్న మడులు ఏర్పాటు చేయాలి. తక్కువ లోతులో విత్తితే మొలకశాతం ఎక్కువ వస్తుంది.

నాటుకునే విధానం

ధనియాలను విత్తుకోవడానికి ముందే నేలపై వేసిబాగా రుద్దాలి. ఫలితంగా విత్తనం రెండు భాగాలుగా విడిపోతుంది. మొలక శాతం పెరుగుతుంది. ఆ తర్వాత పొలంలో చల్లుకోవాలి. విత్తనాలు 8 నుంచి 12 రోజులకు గింజలు మొలకెత్తుతాయి. వ్యవసాయ అధికారుల సూచనలతో సాగు చేస్తే లాభదాయకంగా ఉంటుంది.

ఎరువుల నిర్వహణ

వర్షాధారం కింద నల్ల రేగడి నేలల్లో సాగు చేస్తున్నట్లయితే ఆఖరి దుక్కిలో ఎకరాకు నాలుగు టన్నుల పశువుల ఎరువుతో పాటు 25కిలోల యూరియా, 100కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, 15కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఎరువులను వేయాలి. విత్తనాలు విత్తిన వెంటనే బరువైన నేలల్లో ఎకరాకు 1.3 లీటర్ల పెండిమిథాలిన్‌ను 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. తేలిక నేలల్లో అయితే విత్తనాలు విత్తిన తర్వాత ఒక లీటరు పెండిమిథాలిన్‌ను 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

నీటి నిర్వహణ

విత్తిన వెంటనే నీటి తడి ఇవ్వాలి. ఆ తర్వాత రోజు వదిలి మూడో రోజు ఒక నీటి తడి ఇవ్వాలి. 7 నుంచి 10 రోజుల వ్యవధిలో నీటి తడులు ఇవ్వాలి. డ్రిప్ ద్వారా నీటిని అందించడం వల్ల మొక్కకు కావలసిన నీరు సమృద్ధిగా అందుతుంది.

దిగుబడి

కొత్తిమీర సాధారణంగా 40నుంచి 50 రోజుల వ్యవధిలో కోతకు వస్తుంది. కాబట్టి మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా సాగు చేస్తే మంచి లాభాలు వస్తాయని పలువురు రైతులు చెబుతున్నారు.



బాలుడిని తల్లి, దండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

తల్లిదండ్రుల చెంతకు బాలుడు

ప్రజాశక్తి - చీరాల

పట్టణంలోని విఠల్ నగరకు చెందిన జనార్ధన్, లక్ష్మి దంపతుల కుమారుడు సందీప్ వినాయకుని ఊరేగింపులో జనంతో కలసిపోయి ఒక్కడే చీరాల పట్టణానికి చేరుకు న్నాడు. ఇంటికి తిరిగి వెళ్లేందుకు ప్రయత్నించగా ఎటు వెళ్లాలో అర్థం కాక ఏడుస్తూ అటు ఇటు తిరుగుతున్నాడు. గడియార స్తంభం సెంటర్లో ఏడుస్తున్న బాలుడిని గమ నించిన స్థానికులు వెంటనేపోలీస్ స్టేషన్లో అప్పగించారు. బాలునితో పోలీసులు మాట్లాడి పూర్తి వివరాలు తెలుసుకొని విటల్ నగర్‌లోని తల్లి, దండ్రులకు అప్పగించారు. తమ బిడ్డ కనిపించడం లేదని ఇంటి వద్ద వెతుకుతున్న తమకు బిడ్డను పోలీసులు తీసుకువచ్చి చేర్చడంతో సంతోషంతో పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.



కూలింగ్ వాటర్ క్యాన్లు అందజేస్తునన శరత్‌చౌదరి

వాటర్ క్యాన్ల బహూకరణ

ప్రజాశక్తి - కర్లపాలెం

రోటరీ సేవలు ప్రశంసనీయమని రోటరీ క్లబ్ గవర్నర్ శరత్ చౌదరి అన్నారు. రోటరీ క్లబ్ చేస్తున్న సేవలను ఆయన పరిశీలించి కమిటీ సభ్యులను అభినందించారు. వివిధ ప్రభుత్వ పాఠశాలలకు కూలింగ్ వాటర్ క్యాన్లను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1957 నుంచి అనేక ఉత్తమ సేవా కార్యక్రమాలు చేస్తున్న ట్లు తెలిపారు. ఇటీవల వరదల్లో నిరాశలైన 5వేల మంది బాధితులకు నిత్యావసర సరుకుల కిట్లు అందించినట్లు తెలి పారు. రోటరీ ప్రతినిధుల సేవలు బాగున్నాయని ప్రశంసిం చారు. రానున్న రెండేళ్లలో పట్టణంలో డయాగ్నస్టిక్ టెస్టింగ్ సెంటర్ ప్రారంభించ నున్నట్లు తెలిపారు. అతి తక్కువ ఫీజులతో పరీక్షలు చేయించుకోవచ్చని అన్నారు. రోటరీకి సంబంధించిన భవనం అధునాతనంగా తయారు చేయడం కోసం తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని అన్నారు. సభ్యులు సహకరించాలని కోరారు. రోటరీ గవర్నర్ శరత్ చౌదరి, అసిస్టెంట్ గవర్నర్ వంశీ కృష్ణను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రోటరీ అసిస్టెంట్ గవర్నర్ ఎం వంశీ కృష్ణ, రోటరీ క్లబ్ బాపట్ల అధ్యక్షులు కె ఉపేంద్ర గుప్తా, సెక్రటరీ వేజెండ్ల శ్రీనివాసరావు, ట్రెజరర్ వి వేణుగోపాల్, సీనియర్ రోటరీ సభ్యులు పాల్గొన్నారు.

చెరుకూరులో పిచ్చికుక్క దాడి

ప్రజాశక్తి - పర్చూరు

మండలంలోని చెరుకూరులో శనివారం రాత్రి పిచ్చికుక్క స్వైరవిహారం చేసింది. గ్రామానికి చెందిన మేకా శ్రీను, శామ్యూల్, సుబ్బారావు, వెంకటయ్య తదితర ఎనిమిది మందిని తీవ్రంగా గాయపర్చింది. పిచ్చికుక్క దాడిలో గాయపడిన కొందరిని ప్రయివేటు ఆసుపత్రిలో, మరి కొందరిని బాపట్ల ప్రభుత్వ వైద్యశాలలో చేర్పించి చికిత్స అందించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వీధుల్లో తిరుగుతున్నప్పుడు, ఒకచోట కూర్చొని ఉన్నప్పుడు పిచ్చికుక్క వచ్చి విచక్షణా రహితంగా కరిచినట్లు బాధితులు తెలిపారు. గ్రామంలో రాత్రి పూట బయట తిరగాలంటే భయంగా ఉందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ఆటల పోటీలను ప్రారంభిస్తున్న యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వీరాంజనేయులు

యుటిఎఫ్ ఆధ్వర్యంలో..

జిల్లాస్థాయి ఆటల పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

యుటిఎఫ్ స్వర్ణోత్సవ సంబరాలను పురస్కరించుకొని జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఒంగోలు డిఆర్ఆర్ మున్సిపల్ హైస్కూలులో జిల్లాస్థాయి క్రీడా పోటీలు ఆదివారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వీరాంజనేయులు ప్రారంభించారు. యుటిఎఫ్ ఏర్పడి 50 సంవత్సరాల పూర్తయిన సందర్భంగా స్వర్ణోత్సవ సంబరాలు రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ప్రకాశం జిల్లాలో మండల స్థాయిలో ఉపాధ్యాయులు క్రీడలు పోటీలు నిర్వహించుకొని మొదటి బహుమతి పొందినవారు జిల్లా స్థాయి క్రీడా పోటీలు ఎంపికయ్యారు. వీరంతా డిఆర్ఆర్ఎం మున్సిపల్ హైస్కూల్లో ఆటల పోటీలకు హాజరయ్యారు. మొదటగా క్రికెట్ పోటీలలో హెచ్ఎంపాడు, పొదిలి జట్ల మధ్య ఉత్కంఠభరితంగా జరిగింది. మొత్తం 12 క్రికెట్ జట్టు పాల్గొన్నాయి. వాలీబాల్ సంబంధించి 8 జట్లు పాల్గొనగా టంగుటూరు జట్టు ఫైనల్‌కు చేరుకుంది. టెన్నికాయిట్ మహిళల విభాగానికి సంబంధించి నాలుగు జట్లు పాల్గొనగా కనిగిరి జట్టు ఫైనల్‌లో ప్రవేశించింది. షటిల్ క్రీడలో 20 జట్లు పాల్గొని విజయవంతంగా పోటీలు జరుగుతున్నాయి. కార్యక్రమంలో యుటిఎఫ్ క్రీడల కన్వీనర్ అబ్దుల్‌హై, జిల్లా గౌరవాధ్యక్షులు ఎస్ రవి, సహాధ్యక్షురాలు జి.ఉమామహేశ్వరి, కోశాధికారి చిన్నస్వామి జిల్లా కార్యదర్శులు బాల వెంకటేశ్వర్లు, వెంకటేశ్వరరెడ్డి, జెవివి రాష్ట్ర నాయకులు కె.సుబ్రహ్మణ్యచారి మరియు మండల శాఖ అధ్యక్షులు, యుటిఎఫ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

గణేష్ నిమజ్జన ఉత్సవాలను

ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి

ఎస్పీ ఏఆర్.దామోదర్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

గణేష్ నిమజ్జన ప్రదేశాల్లో భక్తులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, నిమజ్జన ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్పీ ఏఆర్.దామోదర్ తెలిపారు. జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లోని శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో ఏర్పాటు చేసిన పోలీసు గణనాథుడు, 9 రోజులు పూజలందుకున్న అనంతరం ఆదివారం జిల్లా ఎస్పీ కొబ్బరికాయ కొట్టి నిమజ్జన ఊరేగింపును ప్రారంభించారు. ఈ ఉత్సవంలో పోలీసు అధికారులు, పోలీసు సిబ్బంది, చిన్నారులు పెద్దఎత్తున పాల్గొని, జై భోలో గణేష్ మహరాజ్‌కి జై, గణపతి బప్పా మోరియా అనే నినాదాలతో ఊరేగింపుగా కొత్తపట్నం బీచ్‌కి వినాయకుడిని తీసుకువెళ్ళారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో ప్రశాంతంగా గణేష్ శోభయాత్రల నిర్వహణ కోసం ఇప్పటికే అన్ని పోలీస్ స్టేషన్ పరిధిలో ఉత్సవ కమిటీ సభ్యులు, శాంతి కమిటీ సభ్యులతో పోలీసు అధికారులు సమావేశం నిర్వహించారని, జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేశామని, విగ్రహాల వెళ్లే ఊరేగింపులను పోలీసులు పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. ఏదైనా సంఘటన జరిగితే నిర్వాహకులు వెంటనే పోలీసులకు తెలియజేయాలని, ఏమైనా సమస్యలు ఉంటే దగ్గర్లోని పోలీస్‌స్టేషన్‌కు గానీ, డయల్-112 కు గానీ సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఎస్‌బి ఇన్స్పెక్టర్ రాఘవేంద్ర, ఐటి కోర్ ఇన్స్పెక్టర్ సూర్యనారాయణ, ఆర్ఐలు రమేష్ కష్ణన్, రమణారెడ్డి, సీతారామరెడ్డి, ఆర్ఎస్సైలు పాల్గొన్నారు.



నిమజ్జన ఊరేగింపులో పాల్గొన్న ఎస్‌పి, ఏఎస్పీ, పోలీసు సిబ్బంది

నేడు పోలీస్ గ్రీవెన్స్ రద్దు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్:

మిలాద్ ఉన్ నబీ పండుగ సందర్భంగా సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం తాత్కాలికంగా రద్దు చేసినట్లు ప్రకాశం జిల్లా ఎస్‌పి ఏఆర్ దామోదర్ ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఫిర్యాదారులు ఈ విషయాన్ని గుర్తించి దూర ప్రాంతాల నుంచి ఎవరు రావొద్దని ఎస్‌పి సూచించారు.

బాపట్ల జిల్లా: ప్రతి సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించే 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమాన్ని సెప్టెంబర్ 16న సోమవారం "మిలాద్ ఉన్ నబీ" పండుగ సందర్భంగా తాత్కాలికంగా రద్దు చేయడం జరిగిందని జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఒక ప్రకటనలో తెలిపారు. దూరప్రాంతాల నుండి ఫిర్యాదులు ఇవ్వడానికి జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయానికి రాదలచిన ప్రజలు ఈ విషయాన్ని గమనించవలసిందిగా సూచించారు.

జిల్లాలో జనసేన ఎవరి జాగీరూ కాదు

- జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్‌ను తొలగించాల్సిందే - జనసేన పార్టీ నేతల డిమాండ్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ప్రకాశం జిల్లా జనసేన పార్టీ ఎవరి జాగీరు కాదని, జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్‌ను ఆ పదవి నుంచి తొలగించాలని పలువురు జనసేన పార్టీ నేతలు డిమాండ్ చేశారు. స్థానిక లాయర్‌పేట డొక్కా సీతమ్మ ఉచిత అన్నదాన కార్యక్రమ జరుగుతున్న కార్యాలయంలో ఆదివారం జరిగిన పాత్రికేయుల సమావేశంలో జనసేన పార్టీ సెంట్రల్ ఆంధ్ర కన్వీనర్ చీకటి వంశీదీప్ మాట్లాడుతూ జనసేన పార్టీ జిల్లా ప్రచార కమిటీ కోఆర్డినేటర్ జడ బాలనాగేంద్ర యాదవ్ డొక్కా సీతమ్మ పేర గత 60 రోజులుగా ఉచిత అన్నదాన కార్యక్రమం నిర్వహించటం సంతోషంగా ఉందన్నారు. పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆశయాలను ప్రజలలోకి తీసుకెళ్ళటం ముదావహమన్నారు. ప్రకాశం జిల్లాలో జనసేన పార్టీలో స్తబ్దత ఏర్పడిందని, జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్ పార్టీ బలోపేతానికి ఎలాంటి చర్యలూ తీసుకోవటం లేదన్నారు. ప్రకాశం జిల్లా జనసేన పార్టీ ఎవరు జాగీరు కాదని, జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్‌ను ఆ పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. జనసేన పార్టీ గిద్దలూరు ఇన్‌చార్జి బెల్లంకొండ సాయిబాబు మాట్లాడుతూ జిల్లాలో జనసేన పార్టీ బలోపేతం అయ్యేందుకు అధిష్టానం దష్టి సారించాలన్నారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల ఇన్‌ఛార్జులను మార్పు చేయాల్సిన అవసరం ఉందన్నారు. 2024 ఎన్నికలలో దర్శి, గిద్దలూరు నియోజకవర్గాలలో జనసేన పోటీ చేయవలసి ఉన్నా.. అధిష్టానానికి వెళ్లిన తప్పుడు నివేదిక వల్ల అది సాధ్యపడలేదన్నారు. జిల్లాలో జనసేన కార్యకర్తలకు, నాయకులకు సరైన ప్రాధాన్యత లభించడం లేదని ఆయన విమర్శలు గుప్పించారు. ఈ విషయం అధిష్టానం దష్టికి తీసుకువెళ్లలేదని, అధికారంలోకి వచ్చి 4 నెలలే కావటంతో రాబోయే రోజుల్లో అన్నీ సర్దుకుంటాయని ఓపికతో ఉన్నామన్నారు. జనసేన పార్టీ సహాయ సహకారాలతో విజయం సాధించిన ఎమ్మెల్యేలు జనసేన పార్టీ కార్యకర్తలను, నాయకులను దష్టిలో ఉంచుకొని ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అతి త్వరలో పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌ను కలిసి జిల్లా పరిస్థితిని వివరిస్తామన్నారు. జిల్లాలో సమర్థవంతమైన నాయకుడిని ఇన్‌ఛార్జ్‌గా పెట్టడమే కాకుండా గ్రామస్థాయి నుంచి జనసేన పార్టీని బలోపేతం చేసేందుకు కషి చేస్తామన్నారు. జిల్లా ఇన్‌ఛార్జ్‌తో తమకు ఎటువంటి విభేదాలు లేవన్నారు. మార్కాపురం ఇన్‌ఛార్జి ఇమ్మడి కాశీనాథ్ మాట్లాడుతూ జనసేన పార్టీకి ప్రకాశం జిల్లాలో అన్ని వర్గాల నుంచి మద్దతు ఉందన్నారు. ప్రకాశం జిల్లా అధ్యక్షుని మార్చే విషయం పార్టీ అధిష్టానం పరిశీలించాలని కోరారు. దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి బటుకు రమేష్ మాట్లాడుతూ జనసేన పార్టీ జెండా మోసిన ప్రతి నాయకుడు, కార్యకర్తకు న్యాయం జరగాలన్నారు. నామినేటెడ్ పదవులలో తగిన సముచిత స్థానం కల్పించాలని కోరారు. సంతనూతలపాడు ఇన్‌చార్జి కందుకూరి వెంకటేశ్వరరావు(బాబు) మాట్లాడుతూ జనసేన పార్టీ సిద్ధాంతాలు, పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశయాలను ప్రజలలోకి తీసుకెళతామన్నారు. ఒంగోలులో డొక్కా సీతమ్మ పేర ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని నిరంతరం కొనసాగిస్తామన్నారు. జనసేన పార్టీ జిల్లా ప్రచార కమిటీ కోఆర్డినేటర్ జడ బాలనాగేంద్ర యాదవ్ మాట్లాడుతూ జనసేన పార్టీ సిద్ధాంతాలు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ ఆశయాలను జిల్లావ్యాప్తంగా ప్రచారం చేస్తామన్నారు. ఎన్ని ఆటంకాలు, అవాంతరాలు వచ్చినా ఒంగోలు నగరంలో డొక్కా సీతమ్మ ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని కొనసాగిస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు పార్శ కోటయ్య, కోట సుధాకర్, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జనసేన నేతలు

సీతారాం ఏచూరికి ఘన నివాళి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి స్టాఫ్ వర్కర్స్ ఫెడరేషన్ నేతలు ఘనంగా నివాళులర్పించారు. ఒంగోలు ఎల్‌బిజి భవన్‌లో మాదాల వెంకట్రావు అధ్యక్షతన ఆదివారం సంతాప సభ జరిగింది. ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ అఖిల భారత ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మయ్య మాట్లాడుతూ సీతారాం ఏచూరి మరణం కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటని తెలిపారు. రష్యాలో సోషలిజం కూలిన సందర్భంగా సీతారాం ఏచూరి కీలకపాత్ర వహించారు. ప్రకాశం జిల్లాలో జరిగిన అనేక కార్యక్రమాలలో సీతారాం ఏచూరి పాల్గొన్నారన్నారు. సీతారాం ఏచూరి ఆశయాలను కొనసాగించేందుకు అందరూ కంకణ బద్ధులు కావాలని పిలుపునిచ్చారు. సిపిఎం రాష్ట్ర నాయకులు వై.సిద్ధయ్య, జాలా అంజయ్య మాట్లాడుతూ దేశానికి, కమ్యూనిస్టు పార్టీకి సీతారాం ఏచూరి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లక్ష్మయ్య

జూనియర్ ఛాంబర్ సేవలు అభినందనీయం

- సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి స్వామి - ముగిసిన వారోత్సవాలు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జూనియర్ ఛాంబర్ వారోత్సవాలు ఘనంగా ముగిశాయి. చివరి రోజు గ్రేట్ డే సెలబ్రేషన్స్‌కి ముఖ్య అతిథిగా సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి శ్రీ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ జూనియర్ ఛాంబర్ వారోత్సవాలు ఘనంగా జరపటం హర్షించదగ్గ విషయమన్నారు. జాతీయస్థాయి వివిధ రంగాల్లో పేరు ప్రఖ్యాతులు గాంచిన వారిని గుర్తించి అవార్డులు ప్రధానం చేయటం శ్లాగించదగ్గ విషయమని పేర్కొన్నారు. పలు సేవా కార్యక్రమాలు శిక్షణ కార్యక్రమాలు నిరంతరాయంగా కొనసాగిస్తున్న జూనియర్ ఛాంబర్ వారికి శుభాకాంక్షలు తెలియజేయడమే కాకుండా విద్యార్థుల్లో నైపుణ్యం పెంచే విధంగా ప్రజల్లో చైతన్యం తెచ్చే విధంగా పలు శిక్షణా కార్యక్రమాలు ఇంకా ఎక్కువగా నిర్వహించాలని సూచించారు. ఈ వారం రోజులపాటు దాదాపు 5 వేల మంది విద్యార్థులు వివిధ పాఠశాలల నుండి వివిధ రకాల, విభిన్న రకాల ఆటల పోటీలు శిక్షణ తరగతులలో పాల్గొన్నారు.

ముఖ్యఅతిథులుగా జాతీయ పూర్వ అధ్యక్షులు, ప్రస్తుత జాతీయ శిక్షకులు సెనెటర్ డాక్టర్ టి.రవి, రెడ్ క్రాస్ చైర్మన్ పి ప్రకాష్‌బాబు, జాతీయ పూర్వాధ్యక్షులు శేఖర్‌బాబు, జూనియర్ ఛాంబర్ సీనియర్ మెంబర్స్ క్లబ్ చైర్మన్ నందకుమార్, శ్రీ హర్షిని విద్యాసంస్థల చైర్మన్ గోరంట్ల రవికుమార్, సరస్వతి విద్యాసంస్థల చైర్మన్ డి.రమణారెడ్డి, ప్రతిభ విద్యాసంస్థల చైర్మన్ నల్లూరి వెంకటేశ్వర్లు, జూనియర్ ఛాంబర్ నాయకులు బొమ్మల శ్రీనివాస్, వి.వి.రమణా, కసిబిసి నాగేశ్వరరావు బహుమతి ప్రధానం చేశారు. ఈ సందర్భంగా అత్యంత ప్రతిష్టాత్మకమైన అవార్డులను మంత్రి ద్వారా అందజేశారు. అందులో మొదటగా కమలపత్ర అవార్డు హర్షిణి విద్యాసంస్థల డీన్ దాది ఆంజనేయులుకి అనంతరం అవుట్ స్టాండింగ్ యంగ్ పర్సన్ అవార్డు చిన్న వయసులో కలెక్టర్‌గా ఎంపికైన అనంతపురం ట్రైనింగ్ కలెక్టర్ బి.వినూత్నకు అందజేశారు. 24 సంవత్సరాల వయసులోనే జడ్జిగా కొనసాగుతున్న చివుకుల భరత్ కమల్‌కు కూడా అవార్డు ఇచ్చారు. తదుపరి అవార్డు ఎయిమ్స్ వైద్య సంస్థల చైర్మన్ బొమ్మల రామలింగేశ్వరరావుకి అందజేశారు. 13 సంవత్సరాల వయసులో యోగా, డాన్స్‌తో అత్యంత ప్రతిభాపాటవాలు ప్రదర్శిస్తున్న జాతీయ స్థాయి యోగా ఛాంపియన్ చిన్నారి వల్లెపు ధనుశ్రీ కి సూపర్ కిడ్ అవార్డు అందజేశారు. జూనియర్ ఛాంబర్ అధ్యక్ష కార్యదర్శులు కోశాధికారి అయినా కే వరుణ్ కుమార్, బి.శ్రీకాంత్ నరేంద్ర అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. జూనియర్ ఛాంబర్ వారోత్సవాల చైర్మన్ శబరిపి నాయర్, కార్యదర్శి సాత్విక్ రాజ్, కో చైర్మన్స్ కె. శివకోటిరెడ్డి, గంధవళ్ళ బాలకృష్ణ సారథ్యంలో నిర్వహించారు.



అవార్డు అందజేస్తున్న మంత్రి స్వామి